ప్రజావీక్షణం
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవీ
9866330400

# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV
ప్రజా వీక్షణం టీవీ
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :292 16 బుధవారం సెప్టెంబర్ 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

## 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు

- లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు



తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ...మిగతా 2 లో...

## ట్రంప్ కూడా మా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు: డీకే శివకుమార్

- తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు సక్సెస్ అయ్యాయన్న డీకే శివకుమార్
- కర్ణాటక మోడల్ ను రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు అనుసరించాయన్న సీఎం
- ఇప్పుడు ట్రంప్ కూడా తమ తరహా హామీలు ఇస్తున్నారని వ్యాఖ్య



కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ గ్యారెంటీ పథకాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రజాదరణ పొందాయని, చివరికి అమెరికా అధ్య క్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా తమ పథ కాలనే కాపీ కొడుతున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యా నించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు బ్లాక్‌బస్టర్ విజయం సాధించాయని అన్నారు.ద ...మిగతా 2 లో...

## మనం ఇంకా సిద్ధం కాలేదు.. ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి: బిల్ గేట్స్ అనూహ్య వ్యాఖ్యలు

- ఏఐ వృద్ధి నియంత్రణ అవసరమని పిలుపునిచ్చిన బిల్ గేట్స్
- ఇంతటి భారీ మార్పుకు మనం సిద్ధంగా లేమని వ్యాఖ్య
- సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందని హెచ్చరిక
- ఏఐపై ఆందోళన వ్యక్తం చేసిన ఎలాన్ మస్క్, శామ్ ఆల్ట్‌మన్
- సమానత్వం కోసం ఏఐపై 1 బిలియన్ డాలర్లు కేటాయించిన గేట్స్ ఫౌండేషన్



టెక్నాలజీ రంగంలో ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలిచే మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ...మిగతా 2 లో...



## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు..!

- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండి పడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసు గులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు.

...మిగతా 2 లో...

# వినాయక మండపాలకు... ఉచిత విద్యుత్...

- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 12( ప్రజా వీక్షణం)

వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్య మంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచిం చారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. ...మిగతా 2 లో...



# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ,..

- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య తీసుకుందని వెల్లడి
- పార్టీ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య
- ప్రభుత్వం, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి
- పార్టీ సమస్యలను అంతర్గత వేదికల్లోనే చర్చించాలని సూచన





కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.

...మిగతా 2 లో...



## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం

- ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు
- ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ
- పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ

ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళ వారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యా యులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బం దులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోం దని మండిపడ్డారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు

...మిగతా 2 లో...

## పరస్పర సున్నితత్వం పాటించాలి..!

- జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ
- బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ
- పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని మోదీ స్పష్టీకరణ
- భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి
- శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి



న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్య క్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పర స్పరం ఆందోళనలను అర్థం చేసు కుని, సున్నితత్వంతో వ్యవహా రించా ల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ...మిగతా 2 లో...

## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ్ చేయండి

- జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్
- దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్
- యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి
- ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య
- తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రిం



దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయ గలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువ త ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. ...మిగతా 2 లో...

# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం

మొదటిపేజీ తరువాయి

తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

# పరస్పర సున్నితత్వం పాటించాలి..!

మొదటిపేజీ తరువాయి

ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా జరపాలి

## - తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించిన మంథని భారతీయ జనతా పార్టీ నాయకులు

మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 15:

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా జరపాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర బిజెపి శాఖ పిలుపుమేరకు మంగళవారం మంథని మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ సప్త సంకల్పాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం తాసిల్దార్ కు సమర్పించారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుతామని నమ్మబలికి తెలంగాణ ప్రజానీకాన్ని మోసగించి ప్రతి సంవత్సరం విస్మరించడం జరిగింది దానికి గాను భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం దృష్టికి తెలంగాణ సప్త సంకల్పాలను తీసుకురావడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 17న అధికార తెలంగాణ విమోచన దినోత్సవం ప్రతి సంవత్సరం జరపాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్ తెలంగాణ హైదరాబాద్ విమోచనలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ భారీ స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్ తెలంగాణలో నిర్మించాలన్నారు. హైదరాబాద్ తెలంగాణ విమోచన మ్యూజియం అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయాలి అమరవీరుల చరిత్రను స్థానిక వీరుల చరిత్రను జరిగిన పోరాటాలను నమోదు చేసి భవితరాలకు అందించాలన్నారు. పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్ర అజ్ఞాతవీరుల అధికారిక జాబితా నిజాం నిరంకుశ పాలన రజాకారుల దురాగతాలు జమీందారీ జాకిర్దారి దోపిడి ప్రజా పోరాటం ఆపరేషన్ పోలో చరిత్రను పాఠశాల కళాశాల పాఠ్య పుస్తకాల్లో చేర్చాలన్నారు. రజాకార్ల దురాగతాలకు గురైన గ్రామాల్లో విమోచన స్మారక స్తూపాలు ఏర్పాటు చేయాలని, తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలన్నారు. ఈ సప్త సంకల్పాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మండల పరిధిలో సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోగోజు శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షులు బూడిద తిరుపతి, సీనియర్ నాయకులు రాపర్తి సంతోష్ , నారమల్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఎడ్ల సాగర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు గుడ్ల గురువేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు

# దాడి చేశారు..!

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# మనం ఇంకా సిద్ధం కాలేదు.. ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి: బిల్ గేట్స్ అనూహ్య వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

'ఏఐ' పురోగతి వేగాన్ని కొంతమేర తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ సాంకేతికత తీసుకురాబోయే భారీ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచం ఇంకా సిద్ధంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక అంశాలను పంచుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది గతంలోని పర్సనల్ కంప్యూటర్లు లేదా ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణల కంటే భిన్నమైనదని, ఇది సమాజంలో లోతైన మార్పులకు కారణమవుతుందని బిల్ గేట్స్ వివరించారు. "ఇంత వేగవంతమైన, విస్తృతమైన మార్పులకు మనం ఇంకా సంసిద్ధం కాలేదు. నిరంతరం ఆవిష్కరణలను ప్రోత్సహించే నేనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యంగా అనిపించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత సైబర్ దాడుల రూపంలో పెను ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మోడల్స్ నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు వచ్చిన 'హగ్గింగ్ ఫేస్ ఘటన'ను ఆయన ప్రస్తావించారు. ఇటీవల టెస్లా అధినేత ఎలాన్ మస్క్, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వంటి టెక్ దిగ్గజాలు సైతం ఏఐ అభివృద్ధి వేగం పట్ల ఇటువంటి ఆందోళనలనే వ్యక్తం చేశారు. ఇప్పుడు బిల్ గేట్స్ కూడా వారి వాదనతో ఏకీభవించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, ఏఐ వల్ల అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయని గేట్స్ ఫౌండేషన్ విశ్వసిస్తోంది. తమ 'గోల్‌కీపర్స్ రిపోర్ట్'లో పేర్కొన్నట్లుగా, ఏఐని సరైన మార్గంలో నడిపిస్తే, అది సామాజిక సమానత్వాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతుందని వెల్లడించింది. ఈ దిశగా, సమానత్వంతో కూడిన ఏఐ అభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ 1 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు స్పష్టం చేసింది.

# నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం (అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం) ప్రతి సంవత్సరం సెప్టెంబరు 16న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటుచేసింది. సూర్యుని నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహిత వికిరణాలును ఓజోన్ పొర సంగ్రహించి, ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుంది. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వలన ఓజోన్ పొర క్షీణించిపోతోందని 1987లో మాంట్రియల్ ప్రొటోకాల్ (ఓజోన్ పొర క్షీణతపై జరిపిన పరిశోధన) సంస్థ తెలిపింది. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్న పదార్థాల నియంత్రణకు గాను రూపొందించిన మాంట్రియల్ ప్రొటోకాల్‌పై ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 1987, సెప్టెంబర్ 16న సంతకాలు చేశాయి. ఆ తరువాత 1994, సెప్టెంబర్ 16న మరో సమావేశం జరిపి, ఓజోన్ క్షీణతను అరికట్టాలని నిర్ణయించారు. దాంతో ప్రతి సంవత్సం సెప్టెంబరు 16న అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం జరపాలని నిర్ణయించబడింది. పర్యావరణ మార్పులపై, ఓజోన్ పొర క్షీణతపై ప్రజలకు అవగాహన కల్పించడం.అన్ని దేశాల ప్రభుత్వాలు మాంట్రియల్ ప్రొటోకాల్‌ను మరింత సమర్థంగా అమలుచేసి 2050 సంవత్సరానికి ఓజోన్ పొరను 1980కు ముందున్నస్థాయికి తేవడం,అడవుల నరికివేతను పూర్తిగా నిలిపివేయడం,మొక్కలను పెంచడం,యంత్రాల నుంచి వినాశకర వాయువులను విడుదల చేస్తున్న పరిశ్రమలు రక్షణ చర్యలు చేపట్టడం ఇలాంటి కార్యక్రమాలు చేపడతారు.




# పేకాట స్థావరంపై పోలీసుల దాడి ఏడుగురు అరెస్ట్

పెగడపల్లి (ధర్మపురి) : ప్రజా వీక్షణం సెప్టెంబర్ 15 :

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని రామభద్రని పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పెగడపల్లి పోలీసులు మంగళవారం దాడి చేసి, మూడు కార్డుల సిస్టంతో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.41,250 నగదుతో పాటు, 7 మొబైల్ ఫోన్లను, 7 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## వినాయక మండపాలకు

# ఉచిత విద్యుత్

మొదటిపేజీ తరువాయి

దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## దేశం నుంచి ఆశించడమే కాదు..

# సేవ్ చేయండి

మొదటిపేజీ తరువాయి

"యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు. ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

# 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు

మొదటిపేజీ తరువాయి

న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

# ట్రంప్ కూడా మా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు: డీకే శివకుమార్

మొదటిపేజీ తరువాయి

నవంబర్‌లో జరిగే అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిచి కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ, సెనెట్‌లపై ఆధిపత్యం సాధిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' ఇస్తామని ట్రంప్ ప్రకటించడాన్ని డీకే శివకుమార్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు తమ కర్ణాటక మోడల్‌ను అనుసరించాయని, ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇదే తరహా సంక్షేమ హామీలను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ సిద్ధాంతాలకు, భారత రాజ్యాంగ విలువలకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని ఆయన అభివర్ణించారు.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ,..

మొదటిపేజీ తరువాయి

"పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

# కోనసీమ అమలాపురం చారిత్రక 'చెడీ తాలింఖానా'కు జాతీయ, రాష్ట్ర స్థాయి అధికారిక గుర్తింపు కల్పించాలి

## – బీజేపీ విజ్ఞప్తి!

**అమలాపురం, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా:లిసెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం)**

భారతీయ జనతా పార్టీ అమలాపురం పట్టణ శాఖ ఆధ్వర్యంలో, కోనసీమ ప్రాంత సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే అమలాపురం దసరా ఉత్సవాల ప్రత్యేక ఆకర్షణ అయిన 'చెడీ తాలింఖానా' యుద్ధ విద్యకు భారత ప్రభుత్వ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక పండుగ గుర్తింపు కల్పించాలని కోరుతూ ఉన్నతాధికారులకు అధికారిక వినతి పత్రం సమర్పించడమైనది. ఈ మేరకు బీజేపీ అమలాపురం పట్టణ శాఖ అధ్యక్షులు అయ్యల భాస్కరరావు (బాష) నేతృత్వంలో భారతదేశ ప్రధానమంత్రి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, డిజిపి, జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ అలాగే జిల్లా ఎస్పీలకు ఈ విజ్ఞప్తిని పంపడం జరిగింది. అలాగే అమలాపురంలో ప్రతి ఏటా విజయదశమి పర్వదినాన జరిగే దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ చెడీ తాలింఖానా ప్రదర్శన నిర్వహిస్తారు. దీనికి సుమారు 500 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. బ్రిటీష్ కాలం నాటి నుంచి నేటి వరకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం ఆచారంగా వస్తున్న ఈ ప్రదర్శన అమలాపురం పట్టణానికి ఎంతో పేరు తెచ్చింది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే దసరా ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. జిల్లా వాసులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, విజయదశమి రోజు జరిగే ఈ తాలింఖానా విన్యాసాలను స్వయంగా చూడటానికి విమాన టికెట్లు బుక్ చేసుకుని మరీ అమలాపురానికి వస్తుంటారు. ఈ ప్రదర్శనలో కర్రసాము, కత్తిసాము, అగ్గి బరాటా, లేడి కొమ్ముల విన్యాసాలు, బంతుల తాళ్లు, జువ్వలు వంటి 60 రకాలకు పైగా ఒళ్లు గగుర్పాటు కలిగించే విన్యాసాలను చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు, ఆడపిల్లలతో సహా యువతీ యువకులు ఎంతో ప్రతిభతో ప్రదర్శిస్తారు. ఇది కేవలం వినోదం మాత్రమే కాకుండా, శారీరక దారుఢ్యానికి, ఆత్మరక్షణకు, దేశభక్తికి, స్వాతంత్ర్య సమరయోధుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. అమలాపురంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. విజయదశమి రోజు రాత్రి నుండి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు పట్టణంలోని కొంకాపల్లి, మహిపాల వీధి, శ్రీ శేష శయన గండు వీధి, రవణం వీధి, రవణం మల్లయ్య వీధి, శ్రీ విజయ దుర్గా నల్లా వీధి, శ్రీరామపురం అనే ఏడు ప్రముఖ వీధుల నుండి ఐరావతం, హంస వాహనాలపై అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా సాగుతుంది. విద్యుత్ దీపాల కాంతులు, బాణాసంచా కాల్పుల నడుమ జరిగే ఈ ఉత్సవాలు కనులవిందుగా ఉంటాయి. ఈ ఏడు వీధుల నుండి వచ్చే వందలాది మంది యువకులు పోటాపోటీగా చెడీ తాలింఖానా విద్యను ప్రదర్శిస్తూ పట్టణ వీధుల్లో చేసే విన్యాసాలు చూసేవారికి ఎంతో రోమాంచితంగా ఉంటాయి. అంతేకాకుండా అమలాపురం యువకుల ఈ సాహస ప్రదర్శనల ప్రభావం మన చలనచిత్ర



పరిశ్రమపై కూడా పడింది. 2009లో అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'మగధీర' చిత్రంలోనూ ఈ తరహా యుద్ధ విద్యల సన్నివేశాలను స్ఫూర్తిగా తీసుకుని తెరకెక్కించారనే ప్రచారం ఉంది. అలాగే హిందీ, తమిళ చిత్రాల్లోనూ ఇలాంటి విన్యాసాలు తరచుగా కనిపిస్తుంటాయి. దీనిని బట్టి ఈ విద్య ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. లక్షలాది మంది ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఈ భారీ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం ఎంతో పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తుంది. నిర్వాహకులకు, పోలీసులకు సమన్వయం కుదురుస్తూ విజయదశమి రోజు రాత్రి గడపడం పోలీసులకు కూడా కత్తిమీద సాములా ఉంటుందని చెబుతుంటారు. అంతేకాకుండా, ఈ చారిత్రక కళా రూపాన్ని కాపాడుకోవడం ద్వారా మన రాబోయే తరాలకు మన పూర్వీకుల యుద్ధ విద్యల గొప్పతనాన్ని, వారి శౌర్య పరాక్రమాలను అందించినవారమవుతాము. అమలాపురం గడ్డపై పురుడు పోసుకున్న ఈ అరుదైన తాలింఖానా విద్య కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ఒక గొప్ప సాంస్కృతిక వేడుకగా గుర్తింపు పొందాలని పట్టణ ప్రజలు, యువకులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాలు స్పందించి ఈ కళను అధికారిక పండుగ జాబితాలో చేర్చితే, అంతర్జాతీయ స్థాయిలో అమలాపురం ఖ్యాతి నలుదిశలా వ్యాపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ అరుదైన సాంస్కృతిక మరియు చారిత్రక సంపదను కాపాడుతూ, దీనికి జాతీయ లేదా రాష్ట్ర స్థాయి అధికారిక గుర్తింపు కల్పించడం ద్వారా మన ప్రాచీన యుద్ధ కళలకు, అమలాపురం ఖ్యాతికి మరింత సముచిత గౌరవం దక్కుతుందని భారతీయ జనతా పార్టీ అమలాపురం పట్టణ శాఖ కోరుతుంది.

# నందిగామలో సీనియర్ న్యాయవాదిపై కేసు నమోదు: బార్ అసోసియేషన్ నిరసన

### విధులు బహిష్కరించి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన

### ఏసీపీకి వినతిపత్రం అందజేత.. సమగ్ర విచారణకు డిమాండ్

**నందిగామ, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది బండి మల్లికార్జునరావుపై కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక న్యాయవాదులు మంగళవారం తీవ్ర ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో వారు తమ విధులను పూర్తిగా బహిష్కరించి నిరసనగళం వినిపించారు. నందిగామ గాంధీ సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద న్యాయవాదులంతా నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి భారీగా ర్యాలీగా బయలుదేరి ఏసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఏసీపీ సీహెచ్. శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. సీనియర్ న్యాయవాదిపై కేసు నమోదుకు దారితీసిన పరిస్థితులు మరియు నమోదు చేసిన విధానంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఈ కేసుకు సంబంధించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, తక్షణమే కేసును పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# జ్వరాల కట్టడికి క్షేత్రస్థాయిలో ముమ్మర సర్వే..

### మర్రిగూడెంలో తనిఖీలు నిర్వహించిన మలేరియా అధికారి ఎన్.ఎ. ప్రసాద్

**మర్రిగూడెం సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం)**



రెండవ విడత ముందస్తు నివారణ చర్యలలో భాగంగా ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మర్రిగూడెం గ్రామంలో జ్వర సర్వేలు నిర్వహిస్తున్న బృందాలను చింతలపూడి ఉప విభాగాన్ని మలేరియా అధికారి ఎన్.ఎ. ప్రసాద్ తనిఖీ చేశారు. గ్రామాల్లో నిలిచిన నీటిపై పంచాయతీ వారి సహకారంతో అబేట్ మందు పిచికారీ చేయించి మందును పిచికారీ చేసే పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి గృహాల్లోని నీటి పాత్రలను పరీక్షించి, దోమల గుడ్లు (లార్వా) వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత గురించి, శుక్రవారం డ్రై డే అవసరతను ప్రజలకు వివరించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహమును తనిఖీ చేసి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సర్వే కార్యక్రమంలో ప్రజారోగ్య నర్సు కోవదమ్మ, వైద్యురాలు కె. రోహిణి, ఉప విభాగ ఆరోగ్య అధికారి కె. శ్రీనివాసరావు, ఆరోగ్య సహాయకులు వి. శ్రీనివాసరావు, కె. విజయశాంతి, ఎన్. తాతారావు, ఇతర సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానం దోహదపడుతుంది

### జిల్లా కలెక్టర్ డాక్టర్.వి.వినోద్ కుమార్

**బాపట్ల : సెప్టెంబర్ 15 ( ప్రజా వీక్షణం )**

పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానం దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ పై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి మాట్లాడుతూ,జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, కాలుష్య నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానం అమలు తీరు, సంబంధిత సంస్థల్లో పర్యావరణ ప్రమాణాల పాటింపు,తనిఖీలు, మూల్యాంకన ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పర్యావరణాన్ని కాపాడటం ఎంతో అవసరమన్నారు .సంస్థలు, హోటళ్లు,వాణిజ్య సముదాయాలు ఇతర సంబంధిత యూనిట్లు పర్యావరణహిత విధానాలను పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానం ద్వారా ఆయా సంస్థల్లో నీటి పొదుపు,విద్యుత్ ఆదా, పునరుత్పాదక ఇంధన వినియోగం ,వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పచ్చదనం పెంపు,వర్షపు నీటి సంరక్షణ,కాలుష్య నియంత్రణ వంటి అంశాలను పరిశీలించి, నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా మూల్యాంకనం చేయాలని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ ప్రమాణాలను మెరుగ్గా పాటిస్తున్న సంస్థలను గుర్తించి ప్రోత్సహించాలని ఆయన తెలిపారు. రేటింగ్ ప్రక్రియ




పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చూడాలన్నా రు. ఈ రేటింగ్ ప్రక్రియ ఈ నెల 21 వ తేదీ నాటికి జిల్లా,మండల స్థాయిలో పూర్తి చేసి 25వ తేదీ నాటికి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ఎస్సి అనంతరాజు,జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, పర్యాటక శాఖ అధికారి బెన్హర్, బాపట్ల ఎంపీడీవో బాబురావు, వీక్షణ సమావేశం ద్వారా రెవెన్యూ డివిజన్ అధికారులు, డి ఎల్ డి వోలు,ఎంపీ డీవోలు, హోటల్, రిసార్ట్,లాడ్జిల యాజమాన్యం మరియు తదితరులు పాల్గొన్నారు.

# మహేష్‌కుమార్ గౌడ్‌కు కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

### -- టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో అభినందనలు

**బోయిన పల్లి, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేయడంలో ఆయన చేస్తున్న కృషిని నాయకులు అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజలకు పార్టీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో ఆయన నాయకత్వం కీలకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీభవన్‌కు చేరుకుని మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చందర్‌రావు, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్, అరవింద్‌కుమార్, సాహెబ్ సేహంషా, క్రాంతికుమార్, రాము, వెంకటేష్ యాదవ్, పాల్గన్‌రావు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న మహేష్‌కుమార్ గౌడ్‌కు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# పెన్షన్ల ఆన్‌లైన్ ప్రక్రియలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు

### ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులులి

**పోలవరం, సెప్టెంబర్ 15:(ప్రజా వీక్షణం)**



పోలవరం నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ముఖ్యంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలని ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం, పోలవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం కేంద్రంగా.. గ్రామ మరియు వార్డు సచివాలయాల్లో కొనసాగుతున్న పింఛన్ల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించి, అధికారులకు తగు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై తెలుగుదేశం పార్టీ నాయకులు మరింత వేగం పెంచడంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ ఎలా సాగుతుందనే అంశంపై అధికారులతో చర్చించారు. అలాగే ఆన్‌లైన్ ప్రక్రియ సమయంలో కార్యాలయాల చుట్టూ తిరిగే వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని బొరగం శ్రీనివాసులు తేల్చిచెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని గ్రామ వార్డు సచివాలయం సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ఎలాంటి సాంకేతిక జాప్యం లేకుండా, ఇబ్బందులు తలెత్తకుండా పింఛన్లను ఆన్‌లైన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన పెన్షన్ దారులకు ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుతో పాటు కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, పింఛన్ల ప్రక్రియ సజావుగా సాగేలా తమ వంతు సహకారాన్ని అందించారు.

# మాగల్లులో భారీ గుంత ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికార యంత్రాంగం

మాగల్లు, సెప్టెంబర్ 15: (ప్రజా వీక్షణం )

ఎన్టీఆర్ జిల్లానందిగామ మండలం మాగల్లు గ్రామంలోని జడ్పీహెచ్ స్కూల్ పరిధిలో ఏర్పడిన భారీ గుంత ప్రజలు, విద్యార్థులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఈ గుంత కారణంగా రెండు, మూడు సార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.భారీ గుంత సమస్యను సామాజిక మాధ్యమాల ద్వారా పలుమార్లు ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా పాఠశాల పరిధిలోనే ప్రమాదకర గుంత ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రమాదాలు జరిగినా ప్రచారం జరిగినా అధికారులకు ఈ గుంత కనిపించదా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి కాకుండా, ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ గుంతను వెంటనే పూడ్చడంతో పాటు రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని మాగల్లు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.




# జంగారెడ్డిగూడెంలో ఉత్కంఠ.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల దరఖాస్తులకు నేటితోనే తుది గడువు!

--- అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ పట్టణ కమిటీ పిలుపు

--- క్షేత్రస్థాయిలో మంగళవారం నాడు వార్డుల్లో పర్యటించిన కూటమి నాయకులు ---

జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 15:(ప్రజా వీక్షణం)

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల ప్రక్రియలో భాగంగా దరఖాస్తులకు ఈరోజు తో చివరి గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో జంగారెడ్డిగూడెం పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం రంగంలోకి దిగారు. ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్ట మహేష్ కుమార్, చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్‌ల ఆదేశాల మేరకు... జంగారెడ్డిగూడెం పట్టణంలోని వివిధ స్వచ్ఛ / స్వర్ణ వార్డుల్లో పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు నేరుగా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి పెన్షన్ దరఖాస్తుల పరిస్థితిపై ఆరా తీశారు.ఈ సందర్భంగా వార్డుల్లో ఏర్పాటు చేసిన సమావేశాలలో నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అంటే మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని మరోసారి నిరూపిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు ఎలాంటి ఆలస్యం లేకుండా నేరుగా అందాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితర కూటమి నేతల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సమాజంలో ఏ ఒక్క అర్హత కలిగిన లబ్ధిదారుడు కూడా సంక్షేమ పథకాలకు దూరం కావద్దనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించిందని గుర్తుచేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు (అవిటివారు) మరియు ఇతర అర్హత కలిగిన అన్ని వర్గాల ప్రజలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి



అర్హులని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన ఆధార్ కార్డ్, వయసు ధ్రువీకరణ పత్రాలు, కుల/ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మరియు ఇతర అవసరమైన డాక్యుమెంట్లతో నేరుగా తమ సమీపంలోని సచివాలయానికి వెళ్లి వెంటనే పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు సమీపిస్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా అధ్యక్ష, కార్యదర్శులు, స్థానిక కూటమి కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఏ ఒక్క అర్హురాలైన కుటుంబం లేదా వ్యక్తి కూడా సమాచారం అందక లేదా అవగాహన లోపంతో ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూసే బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఇంటికీ వెళ్లి పెన్షన్ దరఖాస్తు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అందే వరకు కూటమి ప్రభుత్వం ప్రజలతో మమేకమై నిరంతరం పనిచేస్తుందని వారు స్పష్టం చేశారు.ఈ పర్యటన మరియు కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, కార్యదర్శి కోనేటి చంటి, జిల్లా ఉపాధ్యక్షులు రావూరి కృష్ణ, అధికార ప్రతినిధి బొబ్బర రాజ్‌పాల్ కుమార్, నాయకులు షేక్ యాకోబ్, తూటుకుంట రాము, నంగులూరి జగత్ కుమార్, అలాగే వివిధ వార్డుల వార్డు అధ్యక్ష-కార్యదర్శులు కంఠమనేని సూర్యనారాయణ, శీలామంతుల రాంబాబు, కంచర్ల గణేష్, షేక్ రషీద్, గుల్లపూడి కామరాజు తదితర కూటమి పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# కోట్ల రూపాయల అప్పుల వివాదం..

## న్యాయం కోసం ఏసీపీని ఆశ్రయించిన బాధితులు

నందిగామ, సెప్టెంబర్ 15: (ప్రజా వీక్షణం)

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం తొర్రగుటీపాడు గ్రామానికి చెందిన సూర్యదేవర సంగమేశ్వరరావుపై సుమారు రూ. 8.5 కోట్ల మేర ఆర్థిక మోసానికి పాల్పడ్డారంటూ పలువురు బాధితులు ఆరోపించారు. గ్రామానికి చెందిన సుమారు 85 మంది వద్ద వివిధ అవసరాల పేరుతో లక్షల రూపాయలు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు పేర్కొన్నారు.తమ వద్ద నగదు తీసుకునే సమయంలో 32 ఎకరాల భూమిని ఆస్తిగా చూపించారని, అనంతరం ఆస్తులను కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లకు మార్చినట్లు బాధితులు ఆరోపించారు. ప్రస్తుతం తమకు ఐపీ నోటీసులు అందడంతో ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు.బాధితులు నందిగామ ఏసీపీ కార్యాలయానికి చేరుకుని ఏసీపీ శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయడంతో పాటు సూర్యదేవర సంగమేశ్వరరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుల ఫిర్యాదును స్వీకరించిన ఏసీపీ శ్రీనివాసరావు విచారణ అనంతరం తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

# మల్లుకుంట సొసైటీ రైతన్నలకు అలర్ట్ : మూడు శాతం వడ్డీ రాయితీ కోసం వెంటనే ఈకేవైసీ పూర్తి చేయండి!

మల్లుకుంట సొసైటీ చైర్మన్ శీలం సాయి వినయ్ మరియు మల్లుకుంట సొసైటీ సీఈఓ కిలాని సత్యనారాయణ

అదనపు వడ్డీ రాయితీ జమ కావాలంటే ఈ పత్రాలు తప్పనిసరి

మల్లుకుంట సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం)



మల్లుకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో ఉన్నా సభ్యులకు మరియు గ్రామ రైతు సోదరులందరికీ సంఘము తరపున అత్యంత ముఖ్యమైన విజ్ఞప్తి.ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలం పరిధిలో ఉన్నా మన మల్లుకుంట సంఘము నందు ఎస్.ఏ.ఓ. క్రాప్ లోన్లు (పంట రుణాలు) మూడు లక్షల లోపు తీసుకొని, ఆ రుణాలను గడువులోగా సకాలంలో చెల్లించిన ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందవలసిన మూడు శాతం వడ్డీ రాయితీని నేరుగా సంఘము నందు గల మీ వ్యక్తిగత ఖాతా నెంబర్ నందు జమ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.ప్రస్తుతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంఘము నందలి రికార్డులన్నీ పూర్తిగా ఆన్‌లైన్ చేయడం జరిగిందని, కావున ఈ సద్వినియోగం ప్రతి రైతన్నకు అందాలంటే కొన్ని లాంఛనాలు పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అందులో భాగంగా ప్రతి ఒక్క రైతు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు మరియు మీ ప్రస్తుత ఫోన్ నెంబరును విధిగా మల్లుకుంట సంఘ కార్యాలయంలో సమర్పించాలి. ఆయా పత్రాలను అందజేసి వెంటనే మీ పేరు మీద ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాల్సిందిగా కోరుతున్నాము.ఒకవేళ ఎవరైనా రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోకపోతే, భవిష్యత్తులో ప్రభుత్వాల నుండి రైతు ఖాతాలకు రావలసిన ఎటువంటి రాయితీలు, సబ్సిడీలు మరియు ప్రయోజనాలు కూడా వారికి వర్తించవని, అసలు పడవని ఇందుమూలంగా ముందస్తుగా హెచ్చరిస్తున్నాము. కాబట్టి రైతన్నలందరూ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి. ఈ ప్రక్రియకు సంబంధించి మీకు మరేదైనా సందేహాలు ఉన్నా, లేదా ఇతర వివరాలు ఏమైనా కావాలన్నా మల్లుకుంట గ్రామంలో ఉన్న మన సొసైటీ కార్యాలయాన్ని నేరుగా సందర్శించి సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాల్సిందిగా రైతులందరికీ పేరు పేరునా తెలియజేయడం జరుగుతుంది.

# పామార్తి గౌతమ్ అకాల మృతి పట్ల పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తీవ్ర దిగ్భ్రాంతి





- దర్భగూడెంలో పామార్తి రమేష్ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపిన శాసనసభ్యులు

- కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

జీలుగుమిల్లి మండలం, దర్భగూడెం (సెప్టెంబర్ 15, ప్రజా వీక్షణం)

పోలవరం నియోజకవర్గంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ కూటమి నాయకులు పామార్తి రమేష్ ప్రియమైన కుమారుడు పామార్తి గౌతమ్ అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందడం స్థానికంగా అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దుర్వార్తను తెలుసుకున్న పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చిర్రి బాలరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హుటాహుటిన దర్భగూడెంలోని పామార్తి రమేష్ నివాసానికి నేరుగా చేరుకున్నారు. అక్కడ గౌతమ్ పార్థివదేహాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయిన గౌతమ్ మృతదేహాన్ని చూసి ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదించడం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. ఈ విషాద సమయంలో ఎమ్మెల్యే స్వయంగా వారి దగ్గరకు వెళ్లి, వారిని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపి వారి బాధను పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ... పామార్తి రమేష్ కుమారుడు గౌతమ్ చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందడం ఆ కుటుంబానికే కాకుండా, మన కూటమి కుటుంబానికే తీరని లోటని అన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉండాల్సిన యువకుడు అర్ధాంతరంగా తనువు చాలించడం ఎంతో బాధాకరమని, ఈ దుఃఖాన్ని దిగమింగుకోవడం ఆ తల్లిదండ్రులకు చాలా కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. భగవంతుడు ఆ కుటుంబానికి ఈ దుఃఖాన్ని భరించే శక్తిని, మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.బాధిత కుటుంబాన్ని ఓదారుస్తూ, కష్టకాలంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. పామార్తి రమేష్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వ పరంగా అందవలసిన సహాయ సహకారాలను అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని గౌతమ్ మృతికి సంతాపం తెలిపారు. అందరూ కలిసి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ అకస్మిక మృతితో దర్భగూడెం గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది.

# బాబోయ్ ఇసుక మాఫియా...

పిట్టలవానిపాలెంలో అక్రమ ఇసుక తరలింపు!

అనుమతులు లేకుండానే పట్టపగలు ఇసుక, మట్టి రవాణా

'షాడో' అండతో సాగుతోందా?

అధికారుల తీరుపై ప్రజల్లో అనుమానాలు

శాసన సభ్యుని ఇలాఖాలో ఇలా జరగటానికి అర్థం ఏమిటి??

పిట్టలవానిపాలెం : సెప్టెంబర్ 15 ( ప్రజా వీక్షణం )

బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండల పరిధిలో ఇసుక,మట్టి అక్రమ తరలింపుపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.ఎలాంటి అనుమతులు లేకుండానే పట్టపగలే ఇసుక,మట్టిని వాహనాల్లో తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక,మట్టి తవ్వకం, తరలింపునకు అవసరమైన అనుమతులు,రవాణా పత్రాలు ఉండాల్సి ఉన్నప్పటికీ,వాటిని పట్టించుకోకుండా తరలింపులు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.స్థానికంగా కొందరి అండదండలతోనే ఈ వ్యవహారం కొనసాగుతోందా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.పట్టపగలే రవాణా.. అధికారులకు కనిపించదా?ప్రధాన రహదారులపై వాహనాల్లో ఇసుక,మట్టి తరలిస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ రవాణాపై ఫిర్యాదులు,



సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలేమిటని నిలదీస్తున్నారు.అక్రమ ఇసుక, మట్టి తరలింపుతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా, పర్యావరణంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి,అనుమతులు లేకుండా ఇసుక,మట్టి తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అక్రమ తరలింపులకు ఎవరి అండ ఉంది? అధికారులు ఇప్పటికైనా మేల్కొని వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 50 ఏళ్లకే పెన్షన్ హామీ ఏది?

## - కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ

కొయ్యలగూడెం:సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం)

ఎన్నికల సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంగళవారం నాడు వైస్సార్సీపీ డిమాండ్ చేసింది.పోలవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు కొయ్యలగూడెంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిటికెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరిపై నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు భీమవరం నియోజకవర్గ పరిశీలకులు మంతెన సోమరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. వీరితో పాటు కొయ్యలగూడెం మండలం ఎంపీపీ గంజి మాల రామారావు, కొయ్యలగూడెం మండల పార్టీ ప్రెసిడెంట్ తుమ్మలపల్లి గంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసర విష్ణు, మాజీ మండల పార్టీ ప్రెసిడెంట్ నాగేశ్వరావు, కొయ్యలగూడెం మండలం బీసీ సెల్ అధ్యక్షుడు మారిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే కొయ్యలగూడెం టౌన్ వైస్ ప్రెసిడెంట్లు పూలపల్లి రవికుమార్, చిటికె నాగర్జున, పోలవరం నియోజకవర్గ క్షత్రియ అధ్యక్షుడు గోలిశెట్టి ప్రసాదు, ప్రధాన కార్యదర్శి దుర్గరాజు, జినిగి కిషోర్, కడిమి నవీన్, చిటికెన స్వామి, అయ్యప్ప, నిక్కర నాగేశ్వరావు తదితర వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# టీడీపీలో చేరారనే కక్షతో దాడులు..

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

కంచికచర్ల సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల: కూటమి ప్రభుత్వ పాలనపై విశ్వాసంతో వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వారిపై భౌతిక దాడులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన రాజకీయ పార్టీని ఎంచుకునే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఆ హక్కును అడ్డుకునేందుకు హింసకు పాల్పడటం సరికాదని ఆమె పేర్కొన్నారు.కంచికచర్ల మండలం మోగులూరు గ్రామంలో ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన షేక్ హర్షద్, షేక్ మౌలానా, షేక్ అహ్మద్, షేక్ నజీర్‌లపై రాజకీయ కక్షతో దాడి చేసినట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి వారి స్వగృహాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.టీడీపీలో చేరితే దాడులు చేస్తారా కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నేతలు అసహనానికి గురవుతున్నారని ఎమ్మెల్యే సౌమ్య విమర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ రాజకీయ నిర్ణయాలు తీసుకుంటుంటే వాటిని అడ్డుకునేందుకు దాడులు, బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. గతంలో హింసాత్మక రాజకీయాలను ప్రోత్సహించిన వైసీపీ నేతలు ఇప్పటికైనా ఆ పంథాను విడనాడాలని, ప్రజల తీర్పును గౌరవించాలని సూచించారు.గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటుతో పోరాడాలి కానీ కర్రలు, దాడులతో కాదని హితవు పలికారు.బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం మోగులూరు ఘటనలో బాధిత కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ, కూటమి నేతలు అండగా ఉంటారని ఎమ్మెల్యే సౌమ్య భరోసా ఇచ్చారు. రాజకీయ కారణాలతో ఎవరిపైనా దాడులు జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకునేలా అధికార యంత్రాంగం దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని తెలిపారు.కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి ప్రతిపక్షం భయపడుతోందని, అందుకే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు.



# భక్తులకు అన్నదానం..

దేవరకద్ర సెప్టెంబర్ 15 ప్రజావి క్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం రాత్రి స్థానిక తీగలప్పకట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఉమా రాజు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు కూడా అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజు స్నేహితులు పాల్గొన్నారు.



# యువత “మోక్షగుండం విశ్వేశ్వరయ్య”ని స్ఫూర్తిగా తీసుకోవాలి

## - సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, తిరుమల రావు

## - ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం):

యువత “మోక్షగుండం విశ్వేశ్వరయ్య”ని స్ఫూర్తిగా తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, తిరుమలరావులు అన్నారు. మంగళవారం సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఎదురుగా గల మోక్షగుండం విశ్వేశ్వరయ్య చౌక్ ఆవరణలో భారత దేశం గర్వించే సివిల్ ఇంజినీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలలో సింగరేణి సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణడైరక్టర్(ఈ అండ్ఎం) ఎం.తిరుమలరావు, వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్లలో ఒకరుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎదగడం భారతదేశానికి ఎంతో గర్వకారణం అన్నారు. భారతదేశం యొక్క ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పినటువంటి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని ఇంజనీర్స్ డే గా నిర్వహించుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్యని స్ఫూర్తిగా తీసుకొని ఇంజనీరింగ్ లో ప్రగతిని తీసుకురావడానికి తమ వంతు కృషి చేయడానికి పూనుకోవాలన్నారు. ఈనాడు భారతదేశంలో ప్రతిష్టాత్మకమైనటువంటి ఇంజనీరింగ్ ప్రాజెక్టులను చేపట్టడం కోసం పునాదులు వేయడం మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో కూడా సాగిందని చెప్పుకోవచ్చు అని తెలియజేశారు. ప్రతీ ఏడాది ఒకొక్క థీమ్ తో ఈ యొక్క ఇంజనీర్స్ డే చేసుకుంటున్నామని ఈ ఏడాది “డిజిటలైజేషన్ ద్వారా స్థిరమైన భవిష్యత్తు కోసం స్మార్ట్ ఇంజనీరింగ్” అనే థీమ్ తో



నిర్వహించుకుంటున్నామని ఇంజనీర్లు ప్రస్తుతం ఉన్న ఆధునిక టెక్నాలజీలను ఉపయోగిస్తూ విలువలతో కూడిన ఇంజనీరింగ్ పని తనంతో నాణ్యమైన ప్రాజెక్టులను నిర్మించి భావి తరాల వారికి అందించి భారత దేశ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఇంచార్జ్ జిఎం(సివిల్) ఆర్.సతీష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(ఈ అండ్ ఎం)ఎం.తిరుమల రావు, (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ఐఎన్టియూసి కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, జిఎం(సిపి అండ్ పి) ఏ.మనోహర్, జనరల్ మేనేజర్(పి అండ్ పి)జి.దేవేందర్, జిఎం(ఆర్ అండ్ డి) సిహెచ్.శ్రీనివాస్, జిఎం(ట్రాన్స్పోర్ట్) ఎం.రామనాథం, జిఎం(ఈ అండ్ఎం) వర్క్ షాప్ అండ్ఎనర్జీ మేనేజ్మెంట్)కె. శ్రీనివాసులు, డిజిఎం(సివిల్) జి.సూర్యనారాయణ, ఎస్ఈ(సివిల్) పి.రాజేంద్ర ప్రసాద్, ఇతర జిఎంలు, వివిధ విభాగాల ఇంజనీర్లు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ను అవమానిస్తే సహించేది లేదు

## - హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలి

## - రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణ):

భారతరత్న అంబేద్కర్ పై అవాకులు చవాకులు పేలుతూ అవమాన పరుస్తూ భారత రాజ్యాంగాన్ని సైతం అపహాస్యం పాలు చేస్తూ మత విద్వేషాలను కులవిద్వేషాలను రెచ్చగొడుతూ విర్రవీగుతున్న హమారా ప్రసాద్ (ఆవారా ప్రసాద్)ను వెంటనే యుఏపి ఏ చట్టం కింద అరెస్ట్ చేయాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తగూడెం క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా శివకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ పై అవాకులు చవాకులు పేలుతూ విషం చిమ్ముతున్న మతతత్వ ఉగ్రవాది హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలన్నారు. సామాజిక న్యాయం కోసం సమసమాజ స్థాపన కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంటరానితనం కుల నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి అందులో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు మహిళలు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు సైతం రిజర్వేషన్లను కల్పించి దేశ సౌభ్రాతృత్వానికి సమైక్యతకు సమగ్రతకు అభివృద్ధికి దశ దిశ నిర్దేశకత్వాన్ని చూయించిన మార్గదర్శకుడు అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మూడ్ గణేష్, పసుపులేటి వీరబాబు, జేబీ శౌరి, నాగ సీతారాములు, ఎర్రా కామేష్, నయీమ్ ఖురేషి, లక్ష్మణ్ నాయక్ లతోపాటు టీఈఏఎం రాష్ట్ర కన్వీనర్, అభ్యుదయ అధ్యాపకులు దాసరి రమేష్, రాష్ట్ర గౌరవ సలహాదారులు సింగరేణి రిటైర్డ్ జిఎం శనగ వెంకటేశ్వర్లు, తెలంగాణ ఉద్యమ యోధుడు సయ్యద్ రషీద్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పిపి ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం నుండి శంకర్, ఆర్గనైజర్ బూర్గుల కరుణాకర్,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతోటి పాల్,టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, సంఘ ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు





సూరం వరప్రసాద్, ప్రముఖ అంబేద్కర్ వాది న్యాయవాది మారపాక రమేష్, రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షులు కంచర్ల జమలయ్య, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు డి.సుధాకర్, జె.ఉపేందర్, సోషల్ యాక్టివిస్ట్ మెంటం బలరాం, యోగా మాస్టర్ గుమలాపురం సత్యనారాయణ, మహిళా నాయకురాళ్లు భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాళ్లు బడికల పుష్పలత, కుంచె లావణ్య, మహిళా సమాఖ్య క్రియాశీలక నాయకురాలు కరీష రత్నకుమారి,ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి,నాయకురాలు దార్ల లక్ష్మి, మైనారిటీ నాయకురాలు కైసర్, స్వరూప, ప్రముఖ అంబేద్కర్ వాదులు బి.బిక్కులాల్, సల్లం శంకర్, పృథ్వీరాజ్, జే.శ్రీను, కే.సాగర్, జూలూరుపాడు నుండి ఈ తిరుపతి ప్రభాకర్, పెనగడప శ్రీను, ఇతర నాయకులు రాజేశ్వరరావు, అంతోటి రాజు, ఉమా మహేశ్వర్, దేవానంద్, వెంకటేశ్వర్లు, జి.మోహన్, అబ్దుల్లా, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, అబ్రయిమ్ చింటూ, సుమన్, అఖిల్, కళాబృందం నుండి కవుటూరి రాము బృందం పాల్గొన్నారు.

# ఆళ్ళ నాని మృతి పట్ల పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్ర దిగ్భ్రాంతి

## ఆళ్ల నాని మరణం అత్యంత దురదృష్టకరం: తెల్లం బాలరాజు

## 20 ఏళ్ల రాజకీయ ప్రయాణాన్ని, స్నేహబంధాన్ని గుర్తు చేసుకుని భావోద్వేగం

## ఉపముఖ్యమంత్రిగా, పార్టీ నేతగా విశేష సేవలు అందించారంటూ కొనియాడారు

ఏలూరు:సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం)

ఏలూరు మాజీ ఉపముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు ఆళ్ళ నాని అకస్మిక మృతి పట్ల పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు తీవ్ర దిగ్భ్రాంతిని, గాఢమైన సంతాపం వ్యక్తంచేశారు. ఆయన మరణవార్త తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆళ్ళ నానితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2004 సంవత్సరం నుంచి 2024 సంవత్సరం వరకు దాదాపు రెండు దశాబ్దాల (20 సంవత్సరాలు) పాటు ఆయనతో తనకు రాజకీయ అనుబంధంతో పాటు చక్కటి స్నేహబంధం కొనసాగిందని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆయనతో కలిసి పనిచేసిన



మధుర జ్ఞాపకాలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు .వైయస్సార్సీపీలోనూ, వివిధ ఉన్నత రాజకీయ హోదాల్లోనూ ఆళ్ళ నాని పార్టీకి, ప్రజలకు విశేష సేవలందించారని బాలరాజు కొనియాడారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారని, ఏలూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు.“ఆళ్ళ నాని రూపంలో నేను ఒక మంచి మిత్రుడిని కోల్పోయాను. వ్యక్తిగతంగా ఆయన ఎంతో మంచివారు, మృదుస్వభావి మరియు అజాతశత్రువు. ఆయనతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని, స్నేహాన్ని ఎప్పటికీ మరచిపోలేను. ఆయన ఆకస్మిక మరణం నాకు తీవ్ర వేదనను కలిగించింది” అని బాలరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.దివంగత ఆళ్ళ నాని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మరియు పార్టీ శ్రేణులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

GENERAL NEWS
16 బుధవారం సెప్టెంబర్ 2026
6
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం
దినపత్రిక

# రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రచురించిన ఏపీ రిజిస్ట్రేషన్ పార్టీలలో నవతరం పార్టీ

**చిలకలూరిపేట : సెప్టెంబర్ 15 ( ప్రజా వీక్షణం )**

సామాన్యుడైన పోరాట పటిమ గల నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం నవతరం పార్టీ రాష్ట్ర ఎన్నికల సంఘం జాబితాలో ఉండటం చిలకలూరిపేట నుండి పార్టీని స్థాపించి 2012 నుండి ఇప్పటివరకు సుమారు 15 సంవత్సరాలు పార్టీని నడిపించడం లో ఎన్నో కష్టనష్టాలు బెదిరింపులు అవమానాలు,త్యాగాలు వీటన్నిటిని తట్టుకొని పార్టీని నిలబెట్టడం సామాన్య విషయం కాదు.మెగాస్టార్ చిరంజీవి సైతం ప్రజారాజ్యం పార్టీని నడపలేక కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు.చాలామంది రాజకీయాలు అంటే డబ్బుంటేనే సరిపోతుంది అనే భ్రమలో ఉంటారు.ఫుల్ టైం పొలిటిషన్ కి డబ్బుతో అవసరం లేదు నిరంతరం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రజల మధ్య ఉండే వారికి ఎప్పుడు ప్రజల్లో ఆదరణ ఉంటుంది.అలా 15 సంవత్సరాల నుండి చిలకలూరిపేట నుండి ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో పోరాడుతూ పార్టీని నిలబెట్టడం సామాన్యమైన విషయం కాదు.నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావుసుబ్రహ్మణ్యం ధైర్యం దమ్ము చూసి తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రేమతో దగ్గరికి తీసుకొని అభినందిస్తూ ఉంటారు.నారా చంద్రబాబు నాయుడు సైతం సామాన్య కార్యకర్త నుండి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి ఆరోజు ఆయన దగ్గర వేలకోట్లు ఏమీ లేవు నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం వలన తెలుగుదేశం పార్టీని అధికారం లోకి తెచ్చి తెలుగు రాష్ట్రాల్లో లో 4 సార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు.చిలకలూరిపేట నుండి పార్టీని స్థాపించి 15 సంవత్సరాలు పార్టీని నడిపిస్తూ ముందుకు సాగుతున్న నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ను నవతరం పార్టీ క్యాడర్,పలువురు రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, పలువురు విద్యావంతులు, స్నేహితులు,శ్రేయోభిలాషులు, పలువురు మేధావులు ఆయన ధైర్యాన్ని ప్రశంసిస్తూ ఉన్నారు.మళ్లీ పుడతామా పెద్ది సినిమాలో రామ్ చరణ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ కు నిదర్శనమే నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం.



# సామాన్యుడిలా బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆకస్మిక పర్యటన!

**బుట్టాయగూడెం సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం)**

ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు పోలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పూర్తిగా సామాన్యుడి వేషధారణలో బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మికంగా పర్యటించారు. కార్యాలయంలో అధికారుల పనితీరును, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలను ఆయన దగ్గరుండి పరిశీలించారు.బుట్టాయగూడెంకు చెందిన ఓ రిటైర్డ్ టీచర్ తన స్థలం (సైట్) విషయంలో ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి విసుగు చెంది, చివరికి ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ?దీంతో ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలపై స్వయంగా ఆరా తీసేందుకు ఎమ్మెల్యే రంగంలోకి దిగారు. అధికారుల పనితీరును దగ్గరుండి పరిశీలించిన ఆయన, సామాన్య ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటున్నారా? సేవలు సకాలంలో అందుతున్నాయా? అని పరిశీలించారు. సుమారు గంటపాటు కార్యాలయంలోనే ఉండి ప్రతి అంశాన్ని నిశితంగా గమనించిన చిర్రి బాలరాజు, ప్రజల నిజమైన సమస్యలు తెలుసుకునేందుకే సామాన్యుడి రూపంలో వెళ్లినట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పారదర్శకంగా సకాలంలో సేవలు అందించాలని ఈ సందర్భంగా అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సామాన్యుడి రూపంలో ఎమ్మెల్యే చేసిన ఈ ఆకస్మిక పర్యటన స్థానిక రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



# బ్రహ్మోస్ భూసేకరణపై బస్వాయిపల్లి రైతులతో ఆర్డీవో సమావేశం..

**దేవరకద్ర సెప్టెంబర్ 15 ప్రజా వీక్షణం**

మండల పరిధిలోని బస్వాయిపల్లి గ్రామం వద్ద బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో భాగంగా రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుసుకునేందుకు ఆర్డిఓ నవీను, మంగళవారం బస్వాయిపల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన అంశాలపై రైతులతో చర్చించి, వారి అభిప్రాయాలు, సమస్యలు, అభ్యంతరాలను ఆర్డీవో నవీన్, అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివిధ అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ మమ్మద్ హర్షద్ , ఆర్ ఐ శశికళ , సర్వేయర్ , పంచాయతీ సెక్రటరీ, జి పి ఓ బస్వాయిపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ అధ్యక్షుడు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంజినీర్లు దేశ ప్రగతికి మార్గదర్శకులు

## ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)**





దేశ అభివృద్ధి, సాంకేతిక పురోగతిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి తెలిపారు. మౌలిక వసతుల కల్పన నుంచి ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల వరకు ఇంజినీర్లు అందిస్తున్న సేవలు దేశ ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని కొనియాడారు. ఏపీ నిట్ లోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో సంస్థ ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద మంగళవారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ రవి కిరణ్ శాస్త్రి మాట్లాడుతూ దేశ నిర్మాణం, అభివృద్ధిలో ఇంజినీర్లు పోషిస్తున్న పాత్ర ఎంతో అమూల్యమైనదని కోనియాడారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతికత, స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో వినూత్న పరిష్కారాలను అందించాల్సిన బాధ్యత ఇంజినీర్లపై ఉందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఇంజినీర్లు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ దేశ ప్రగతికి మరింతగా సేవలందించాలని సూచించారు. సమాజ అవసరాలను గుర్తించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సాంకేతిక పరిష్కారాలపై యువ ఇంజినీర్లు దృష్టి సారించాలని సూచించారు. భారతదేశపు ప్రముఖ ఇంజినీర్, దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతినే ప్రతి ఏటా ఇంజినీర్స్ డే గా నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. విశ్వేశ్వరయ్య చూపిన క్రమశిక్షణ, నిబద్ధత,, దేశసేవా స్ఫూర్తిని నేటి ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకుని మరింత మెరుగైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని వివరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ కూర్మయ్య, డాక్టర్ రాముడు, డాక్టర్ గుర్రాల కిరణ్ కుమార్, డాక్టర్ శారదా ప్రసన్న మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లా రాజకీయాలలో విషాదం..

## మాజీ మంత్రి ఆళ్ల నాని గుండెపోటుతో కన్నుమూత

**ఏలూరు జిల్లా సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం)**



మాజీ ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) ఉదయం వాకింగ్ కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన ఆళ్ల నాని అనంతరం తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తెలుస్తుంది.ఇంట్లో సోఫాలో కూర్చున్న సమయంలో ఒక్కసారి గా అస్వస్థతకు గురికావడంతో ఆయన సతీమణి వెంటనే స్థానికలను అప్రమత్తం చేసి ఆసుపత్రి కి తరలించారు అప్పటి వరకు ఆరోగ్యం గా కనిపించిన ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో అయన అకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, అభిమానుల ఏలూరు రాజకీయ వర్గాల్లో మరియు ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం అలుముకుంది.కాంగ్రెస్ పార్టీ తరఫున రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆళ్ల నాని, ఏలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజల్లో బలమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి వెంటే నడిచి, 2019 ఎన్నికల్లో జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో వైద్య ఆరోగ్య శాఖను సమర్థవంతంగా నడిపించడంలో ఆయన పాత్ర ఎంతో కీలకం.అయితే, గత కొంతకాలంగా క్రియాశీల రాజకీయాల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఆయన ఇటీవల తెలుగుదేశం పార్టీ (టీడీపీ ) లోకి చేరారు. ఇలా రెండు ప్రధాన పార్టీలలోనూ కీలక బాధ్యతలు చేపట్టి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆళ్ల నాని ఆకస్మిక మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, పార్టీలక అతీతంగా నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జనసైనికుడి కుటుంబానికి ఎమ్మెల్యే బొలిశెట్టి అండ

## రూ.లక్ష ఆర్థిక సాయం.. కుటుంబ సభ్యులకు పరామర్శ

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్15 (ప్రజా వీక్షణం)**

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా బ్యానర్లు కడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన అమలాపురం నియోజకవర్గంలోని బెండమూరులంక గ్రామానికి చెందిన జనసైనికుడు రోళ్ళ ప్రేమ్ కుమార్ కుటుంబానికి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అండగా నిలిచారు. ప్రేమ్ కుమార్ మృతి విషయం తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం బెండమూరు లంకలోని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఓదార్చడంతో పాటు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి జనసేన పార్టీ, నాయకులు, కార్యకర్తలు అన్ని విధాలా అండగా ఉంటారని బొలిశెట్టి శ్రీనివాస్ భరోసా కల్పించారు. జనసైనికుడి కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు కష్టకాలంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారని పలువురు జనసేన నాయకులు కితాబిచ్చారు.



# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది..

# రైతాంగానికి ఎన్డీఏ ప్రభుత్వం అండ

ప్రత్యామ్నాయ పంటల విత్తనాలపై 80% సబ్సిడీ

పంట నష్టపోతే ఎకరాకు రూ. 20,000 బీమా పరిహారం

2027 నాటికి పోలవరం పూర్తి, గ్రావిటీ ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు

చందోలు వద్ద కొత్త ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు

బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

**పిట్టలవానిపాలెం : సెప్టెంబర్ 15 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల నియోజకవర్గం, పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు, కోడూరు,సంగుపాలెం,కోమలి, రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మంగళవారం విస్తృత పర్యటన చేశారు.జిల్లా, మండల స్థాయి వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి స్వయంగా వ్యవసాయ పొలాలను పరిశీలించారు. ఎల్-నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.వాతావరణ శాఖ నివేదికల ప్రకారం రాబోయే రెండు మూడు నెలలు వర్షాలు ఆశాజనకంగా లేనందున, కొత్తగా నీటి ఆధారిత పంటలు వేయవద్దని రైతులను కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో త్రాగునీరు, పశువుల మేతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాబట్టి రైతులు మినుము, పెసర,సజ్జలు,రాగులు, కందులు,కొర్రలు,నువ్వులు తదితర ప్రత్యామ్నాయ/ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 80% సబ్సిడీపై విత్తనాలను అందిస్తోందని తెలిపారు. వెయ్యి రూపాయల విత్తనాలకు రైతులు కేవలం రూ. 200 చెల్లిస్తే సరిపోతుందని,మిగతా భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. బోరుబావుల సదుపాయం ఉన్న రైతులు వేరుశనగ కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు.



# గణేష్ నగర్‌లో ఘనంగా శ్రీ సిద్ధి వినాయక స్వామి దర్శనం

-- వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖ టీడీపీ, దళిత మరియు బీసీ నాయకులు

-- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాయకులకు ఘనసత్కారం

**గుడివాడ ( సెప్టెంబర్ 15: ప్రజా వీక్షణం ):**

కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గం ఎన్టీఆర్ కాలనీ శివారులోని గణేష్‌నగర్‌లో కొలువైన త్రిశక్తి త్రిమూర్త స్వరూప శ్రీ సిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో వినాయక చవితి పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.ఆలయ ప్రెసిడెంట్ సోమన నాగేంద్ర ప్రత్యేక ఆహ్వానం మేరకు, ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం నుండి విచ్చేసిన ప్రముఖులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరియు రాష్ట్ర దళిత నాయకులు జక్కుల విజయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు కట్టా గోపి, అలాగే రాష్ట్ర బీసీ నాయకులు కట్టా రాఘవులు పాల్గొన్నారు.స్వామివారిని దర్శించుకున్న అనంతరం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రెసిడెంట్ సోమన నాగేంద్ర మరియు కమిటీ సభ్యులు విచ్చేసిన అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. నాయకులు కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ వేడుకల్లో ఆలయ గౌరవ అధ్యక్షులు బురిడీ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ తిప్పా వకుల్ కుమార్, సెక్రటరీ నిల్లా కోట వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పప్పు రాంబాబు, కోశాదికారి సిద్దాని కోటేశ్వరరావు, ఉప కోశాధికారి నిల్లా లక్ష్మీ గణేష్, కార్యవర్గ సభ్యులు నిల్లా జ్యోతిశ్వరరావు, సోమన కోట బుద్ధ కేదారేశ్వర కుమార్, సోమన హేమ సుందర శ్రీనివాసరావు, అనుపోజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# భక్తితో గణపతికి పూజలు..

**దేవరకద్ర, సెప్టెంబర్ 15 ప్రజా విక్షణం**

మహా గణపతికి రెండో రోజుఅయినా మంగళవారం రాత్రి హైదరాబాదులోని కొత్తపేటలోని సెలూన్ లో ఏర్పాటు చేసిన మహా గణపతి విగ్రహానికి భక్తి శ్రద్ధతో పూజ కార్యక్రమాలు చేశారు. సింధు వర్ధిని, గణపతికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అందులో పని చేసే సిబ్బంది వారు కూడా పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
7
16 బుధవారం సెప్టెంబర్ 2026
www.prajaveekshanam.in

# వాడ వాడలా వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం..

### మట్టి గణపతే మహా గణపతి.. భక్తిశ్రద్ధలతో పూజలు..

**దేవరకద్ర సెప్టెంబర్ 15 ప్రజా విక్షణం**

ఓం గం గణపతయే నమః ఓం మంగళ పతయే నమః అంటూ ఆదిదేవుడు గణేష్ పూజలు అందుకున్నాడు సోమవారం రాత్రి నుండి తొమ్మిది రోజులు పాటు జరిగే ఉత్సవాలకు అన్ని మండపాలు ముస్తాబు అయ్యాయి. ఉండ్రాళ్ళయ్యకు దండాలు పెడుతూ నిత్యం పూజ చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు.ఊరు వాడ మండపాల్లో ఆదేవదేవుణ్ణి ప్రతిష్టించి భక్తితో పూజలు చేశారు.మండలంలోని అన్ని గ్రామాల్లో మున్సిపాలిటీ కేంద్రంలో తీగలపకట్ట, అంబేద్కర్ నగర్, హరిజనవాడ, వాల్మీకి నగర్, గౌడ సంఘము, చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద, కురువ యాదవ సంఘం, శివాజీ నగర్, ప్రభాస్ ఫ్రెండ్స్, కటిక వీధి, తెలుగు వీధి, రైల్వే స్టేషన్, బీసీ నగర్ కాలనీ, నందు విగ్రహాలను ప్రతిష్టించారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరి ఇంట్లో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తొమ్మిది రోజులు పాటు పలువురు భక్తులు వినాయక చవితి ఉత్సవాలను జరుపుకుంటారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని ఆమె తెలిపారు. గణనాధుడు వినాయకుడు మనందరి ఆశయాలు నెరవేర్చాలని తలపెట్టిన ప్రతి కార్యం విజయవంతంగా పూర్తి అవ్వాలని వినాయక స్వామి ఆశీస్సులతో ఆరోగ్యం కలగాలని కుటుంబంలో సౌఖ్యం నెలకొలానని యువకులు మిత్రులు మరింత సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజానికి మేలు చేసే అవకాశాలు మరింత లభించాలని మున్సిపల్ చైర్ పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, ఆకాంక్షించారు.వినాయకుడు మనకు శక్తి జ్ఞానం ధైర్యం ప్రసాదించి ఎప్పటికప్పుడు సేవ మార్గంలో నడిపిశీచాలని భక్తులందరికీ వినాయక శుభాకాంక్షలు తెలియజేశారు.




# దిప్పకాయలపాడులో రజకుల జీవనాధారమైన 'పద్దమ్మ చెరువు' అక్రమణ యత్నం!

### చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట రజక సంఘం నిరసన

**దిప్పకాయలపాడు (సెప్టెంబర్ 15:ప్రజా వీక్షణం):**

దిప్పకాయలపాడు గ్రామంలో రజకుల జీవనాధారమైన పద్దమ్మ చెరువును అక్రమంగా ఆక్రమిస్తూ, చెరువుగట్టును తవ్వి పూడ్చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా రజక సంఘ అధ్యక్షులు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య ఎంపీడీవో కార్యాలయం వద్ద రజకులతో కలిసి పంచాయతీ కార్యాలయ ప్రత్యేక అధికారి కె. సురేష్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ.. మండలంలోని దిప్పకాయలపాడు గ్రామంలో పద్దమ్మ చెరువుపై దశాబ్దాలుగా రజకులు బట్టలు ఉతుకుతూ తమ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన యాదవులకు, రజకులకు గత ఏడాది కాలంగా ఈ చెరువు విషయంలో వివాదం నడుస్తోందని, దీనిపై రజకులు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోగా, ఇటీవల కాలంలో చేపల వలలు కూడా తెంపుతున్నారని ఆరోపించారు.తాజాగా రెండు రోజుల క్రితం రాత్రి వేళలో మూడు జేసీబీలతో చెరువుగట్టును తవ్వి, మట్టిని చెరువులో పోసి పూడ్చేస్తున్నారని తెలిపారు. దీనిపై స్థానిక ఎస్సై చంద్రశేఖర్‌కు రజకులు ఫిర్యాదు చేయడంతో.. ఆయన స్పందించి జేసీబీలను నిలిపివేసి పనులు ఆపాలని హెచ్చరించడంతో ఆ కొద్దిసేపు పనులు నిలిచిపోయాయన్నారు. అయితే, మంగళవారం తమ కుల సంఘమైన రజకులతో కలిసి సమావేశం నిర్వహిస్తుండగానే, యాదవులు మళ్లీ జేసీబీలతో చెరువుగట్టును తవ్వే పనులు చేపట్టారని, రజకుల చెరువును అక్రమంగా ఆక్రమించుకుంటున్న వారిపై పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకుని రజకులకు న్యాయం చేయాలని కట్లయ్య కోరారు .బాధిత రజకుల విజ్ఞప్తిపై స్పందించిన ప్రత్యేక అధికారి కె. సురేష్.. చెరువు వద్ద వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాలను పూర్తిగా నిలిపివేయాలని పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్పకాయలపాడు గ్రామ రజక సంఘం నాయకులు పల్లంట్ల సురేష్, జిల్లా నాయకులు కండెల్లి సుబ్బయ్య, ఎలమంచిలి నాగశేషు, నట్ట లక్ష్మీప్రసన్న, కోమటి మురళి, కడకట్ల సత్తిబాబు, జయలక్ష్మి, నాగేశ్వరరావు, మాధవరపు నాగమణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి
- యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం):**

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడంతో పాటుగా యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. దుమ్ముగూడెం మండలం మల్కానపల్లి, చిన్నబండిరేవు గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు పరస్పర సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మల్కానపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ అంకిత్ భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించారు. సుమారు 2 కిలోమీటర్లు అటవీ ప్రాంతం గుండా నడిచి క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామ సరిహద్దులు భూముల విస్తీర్ణం ఎంజాయర్ల వివరాలు పాత రెవెన్యూ రికార్డులు క్షేత్రస్థాయి కొలతలు రీ సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తయినప్పటికీ రీ సర్వే ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాత రికార్డులు మ్యాప్‌లు క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలని సూచించారు.సర్వే పరిధిలో సుమారు 120 మంది ఎంజాయర్లు ఉన్నట్లు అధికారులు వివరించగా వారి సంఖ్య భూ వివరాలు పట్టాదారు పాసుపుస్తకాల పరిస్థితి రీ సర్వే పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఆర్ఐను ప్రశ్నించారు. అయితే ఆర్ఐ సరైన వివరాలను ప్రాథమిక సమాచారాన్ని స్పష్టంగా అందించలేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ రికార్డులు సర్వే వివరాలపై క్షేత్రస్థాయి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాలకు సంబంధించిన పాత సర్వే రికార్డులు సరిహద్దుల వివరాలను అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని రీ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. దుమ్ముగూడెం మండలంలో మొత్తం 8 గ్రామాల్లో భూ రీ సర్వే చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఐదు గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పూర్తికాగా మూడు గ్రామాల్లో గ్రామసభలు పూర్తయ్యాయని లింగాపురం పరిధిలో సుమారు 250 ఎకరాల్లో రీ సర్వే జరుగుతున్నట్లు వివరించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. మల్కానపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారుల వారీగా నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల సంఖ్య వారికి నిర్వహించిన సర్వే వివరాలను ఎంపీడీవో వివేక్ చంద్రను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో సరైన సమాచారం అందించలేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం సరైన సమాచారం అందించకపోవడంపై ఎంపీడీవోకు చార్జ్‌మెమో జారీ చేసి 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనం అందేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నిరంతరం పర్యవేక్షించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చిన్నబండిరేవు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల భవనాలు తరగతి గదులు వసతి గృహాలు ఇతర మౌలిక వసతుల నిర్మాణ పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి భోజనం క్రీడలు ఇతర అవసరమైన సౌకర్యాలు సమగ్రంగా అందేలా క్యాంపస్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు సాంకేతిక నిబంధనలు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రతి అధికారి తన పరిధిలోని పనులపై పూర్తి అవగాహన కలిగి క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో వివేక్ చంద్ర, ఆర్ఐ, సర్వే అధికారులు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అయినవిల్లి విఘ్నేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

### ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్ష

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)**

కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని ముఖేశ్వరం అయినవిల్లిలో కొలువైన విఘ్నేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధికి చేరుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. విఘ్నాలను తొలగించి భక్తులకు శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన వేడుకున్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో సంతోషం, శాంతి, అభివృద్ధి నిండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలతోపాటు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, పార్టీ శ్రేణులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# చేగొండపల్లిలో వైభవంగా వినాయక చవితి వేడుకలు..

### ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన ఏపీ క్రీడా ప్రాధికార డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి విజయ్ దంపతులు

**పోలవరం సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం):**

ప్రకృతి రమణీయత ఉట్టిపడే పచ్చని వాతావరణంలో, భక్తిశ్రద్ధల నడుమ పోలవరం నియోజకవర్గంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ క్రీడా ప్రాధికార డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి విజయ్ దంపతులు పోలవరం నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా చేగొండపల్లి గ్రామ ప్రజలకు వినాయక చవితి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.సోమవారం నుండి పోలవరం మండలం చేగొండపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా కొవ్వాసు జగదీశ్వరి విజయ్ దంపతులు స్వయంగా పాలుపంచుకుని, గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిభావంతో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేసి విశేష పూజలు సమర్పించారు. అనంతరం ప్రథమ పూజ్యుడైన విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులను ఘనంగా అందుకున్నారు.ఈ సందర్భంగా కొవ్వాసు జగదీశ్వరి విజయ్ దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. సమస్త విఘ్నాలను తొలగించి, భక్తులకు అష్టైశ్వర్యా లను,



విజయాలను ప్రసాదించే దైవంగా కొలిచే విఘ్నేశ్వరుని కృప ఉమ్మడి ప్రాంత ప్రజలందరిపై నిరంతరం ఉండాలని మనసారా ఆకాంక్షించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందోత్సా హాలు, పరిపూర్ణమైన ఆరోగ్యం, అష్టైశ్వర్యాలు, ప్రశాంతత వెల్లివిరియాలని కోరుకున్నారు.ప్రజల దైనందిన జీవితాల్లో ఎదురయ్యే ఎలాంటి అడ్డంకులు, విఘ్నాలు అయినా తొలగిపోయి, యువతతో పాటు ప్రతి ఒక్కరూ చేపట్టిన ప్రతి కార్యం దిగ్విజయంగా పూర్తి కావాలని వారు దీవించారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి వినాయకుని దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు.జగదీశ్వరి విజయ్ దంపతులు చేగొండపల్లిలో పర్యటించి పూజలు నిర్వహించడం, స్థానిక ప్రజలతో మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలపడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో స్థానిక ప్రజలు, భక్తులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. మండపాల వద్ద భక్తుల కోలాహలం, మారుమోగుతున్న భక్తి గీతాలతో పోలవరం ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# రైతులతో సమావేశం నిర్వచించిన అధికారులు..

**దేవరకద్ర సెప్టెంబర్ 15 ప్రజా వీక్షణం**

మండల పరిధిలో బసవయపల్లి గ్రామంలో మంగళవారం బ్రహ్మోస్ కు సంబంధించి రైతులతో అధికారులు సమావేశం నిర్వహించారు. బ్రహ్మోస్ క్షిపాణి తయారీ కేంద్రం సందర్భంగా అందులో రైతుల భూములు పోతున్నందుకు వారితో గ్రామ సర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చే విధంగా చర్య తీసుకోవడం జరుగుతుందని స్థానిక తహసిల్దార్ ముహమ్మద్ హర్షద్ తెలిపారు. అలాగే జీనుల గ్రామంలో జినుగురాల గ్రామంలో కూడా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరంలో ఆర్ ఐ శశికళ, జిబి ఓ వెంకట రాములు, నాగేష్, రైతుల పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

## - కార్పొరేషన్ మేయర్ గణేష్

## - కుట్టుమిషన్ల శిక్షణ సర్టిఫికెట్స్ పంపిణి

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15(ప్రజా వీక్షణం):

ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. రామవరంలోని 16వ డివిజన్ పరిధిలో మదర్ తెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ మునిగడప పద్మ హాజరై మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదగడం అనేది ఆలోచన రావడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇలాగే ప్రతి మహిళ కుటుంబంలో ఆర్థికంగా చేదోడువాదాడుగా ఉంటూ తన కాళ్లపై తన నిలబడి సమాజంలో ఒక గౌరవాన్ని పొందాలని సూచించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో మహిళల స్వయం ఉపాధికి తమ వంతుగా అవకాశమున్న ప్రతి పనిని అందుబాటులోకి తేవడానికి శాయశక్తుల ప్రయత్నం చేస్తామన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం పాటుపడుతున్న మదర్ తెరిసా ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ సంధ్యా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళలంతా క్రమశిక్షణతో శిక్షణ పొంది వృత్తిలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ శిక్షణ ఇచ్చిన టీచర్ కవిత, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, న్యాయవాది మునిగడప వెంకటేశ్వర్లు, శిక్షణకు వసతి గృహాన్ని అందించిన దండే భాగ్యలక్ష్మి, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.





# కొండేపాటి రామకృష్ణ, కోసూరి నరేష్ ఆధ్వర్యంలో మర్రిగూడెంలో ఘనంగా బీజేపీలోకి భారీ చేరికలు!

### కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి వంకా కాంచనమాల

### మోడీ 25 ఏళ్ల ప్రజా సేవ స్ఫూర్తితో... మర్రిగూడెంలో బీజేపీలోకి స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు!

మర్రిగూడెం సెప్టెంబర్ 15:(ప్రజా వీక్షణం)

దేశ ప్రధాని నరేంద్ర మోడీ 25 సంవత్సరాల నిరంతరాయ ప్రజా సేవలకు ప్రతీకగా మరియు ఆయన 76వ జన్మదిన శుభాకాంక్షలను పురస్కరించుకుని ఏలూరు జిల్లాలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా మంగళవారం నాడు ఏలూరు జిల్లా, బుట్టాయగూడెం మండలం మర్రిగూడెం గ్రామంలో భారతీయ జనతా పార్టీలోకి యువత, మహిళలు మరియు రైతులు అత్యంత భారీ సంఖ్యలో చేరారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రధాని నరేంద్ర మోడీ సమర్థవంతమైన, సుపరిపాలన విధానాలు నచ్చే తామంతా తమ గ్రామ అభివృద్ధే ధ్యేయంగా బీజేపీలో చేరుతున్నట్లు గ్రామస్తులు ముక్తకంఠం తో ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చేరికల కార్యక్రమం పోలవరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మరియు పోలవరం ఏఎంసీ వైస్ చైర్మన్ కొండేపాటి రామకృష్ణ, అలాగే బీజేపీ బుట్టాయగూడెం మండల అధ్యక్షులు కోసూరి నరేష్ సంయుక్త మరియు పటిష్టమైన ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్థాయిలో పార్టీ పట్ల పెరుగుతున్న ఆదరణను ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది. మర్రిగూడెం గ్రామానికి చెందిన నూతన సభ్యులను భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి వంకా కాంచనమాల స్వయంగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ గిరిజన ప్రాంతాల్లో బీజేపీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడెం గ్రామానికి చెందిన ప్రముఖులు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. పార్టీలో



చేరిన ప్రధాన గ్రామస్తులు బుద్ధుల నాగేంద్రబాబు, కుంజ వెంకన్న బాబు, పూనెం నాగేంద్రబాబు, కుంజ చెల్లన్న దొర, గోరం రమేష్, కుంజ దుర్గారావు, కుంజా సిరమన్న దొర, ఘోరం మంగ, మడకం నాగదేవి, కారం సరస్వతి, తెల్లం సీతామహాలక్ష్మి, ఘోరం పెంటారావు, గోరం రాము, చోడెం దుర్గారావు, మడకం గంగాధర్ రావు తదితరులు అధికారికంగా బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఏలూరు జిల్లా కార్యదర్శి గూట్ల ధర్మరాజు ప్రత్యేక అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ యువ నాయకులు, స్థానిక బూత్ స్థాయి కన్వీనర్లు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని కొత్తగా పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ప్రధాని మోడీ సుపరిపాలన, దేశాభివృద్ధికి ఆయన చేస్తున్న అంకితభావం చూసి మర్రిగూడెం గ్రామంలో యువత, రైతులు, మహిళలు స్వచ్ఛందంగా బీజేపీలోకి రావడం అభినందనీయమని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని మండల అధ్యక్షులు కోసూరి నరేష్ పేర్కొన్నారు.

# వినాయకుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

## వినాయక మండపాల్లో వడ్డి రఘురామ్ నాయుడు ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శేషమహల్ థియేటర్ సమీపంలో డైమండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆయన సందర్శించారు. అనంతరం రామాలయం సెంటర్‌లో గోల్డ్ గణేష్ యూత్, టాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీటితో పాటు 21వ వార్డు కొబ్బరి తోట, 22వ వార్డు కృష్ణుడు చెరువు ప్రాంతాలతో పాటు రూరల్ మండలంలోని కృష్ణయ్యపాలెం, కొండ్రుప్రోలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులను ఆయన అభినందించారు. వడ్డి రఘురామ్ నాయుడు ఆయా మండపాలను సందర్శించిన సందర్భంగా భక్తులు, యువత, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పండుగ వాతావరణంలో ఆయనతో కలిసి భక్తులు ఉత్సాహంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.









# ఎన్టీఆర్ జిల్లాలో సంచలనం సృష్టించిన వృద్ధురాలి బంగారు నానుతాడు దోపిడీ కేసు ఛేదన!

### ఒక్క క్లూ కూడా లేని కేసును కేవలం 48 గంటల్లోనే ఛేదించి, నిందితుడిని కటకటాల వెనక్కి నెట్టిన వీరులపాడు పోలీసులు

నందిగామ, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం):

ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ఒక దారుణమైన దోపిడీ ఉదంతం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఒంటరిగా గేదెలు మేపుకుంటున్న ఓ అమాయక వృద్ధ మహిళపై పాశవికంగా దాడి చేసి, ఆమె మెడలోని బంగారు నానుతాడును బలవంతంగా లాక్కెళ్లిన కిరాతకుడిని పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లభించని ఈ క్లిష్టమైన కేసును వీరులపాడు పోలీసులు కేవలం 48 గంటల వ్యవధిలోనే ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నా రు.గూడెం మాధవరం గ్రామానికి చెందిన తన్నీరు కార్తీక్ (26) అనే యువకుడు ఈ నెల 12వ తేదీన గ్రామ శివారులో ఒంటరిగా గేదెలు కాపలా కాస్తున్న వృద్ధురాలిని గమనించాడు. ఎవరూ లేని అదును చూసి, తన ముఖానికి గుడ్డ కట్టుకుని ఆమెపైకి ఉనికిపడ్డాడు. రోడ్డు పక్కన ఉన్న బండరాయితో వృద్ధురాలి తలపై బలంగా కొట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. ఈ దాడితో నిస్సహాయురాలైన వృద్ధురాలి మెడలోని బంగారు నానుతాడును తెంపుకుని, వెంటనే తాను సిద్ధంగా ఉంచుకున్న ద్విచక్ర వాహనంపై వేగంగా పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. అయితే, ఘటన జరిగిన ప్రదేశంలో ఎలాంటి నిఘా కెమెరాలు లేకపోవడం, ప్రత్యక్ష సాక్షులు కరువవడం, నిందితుడు ముఖానికి గుడ్డ కట్టుకోవడం వంటి కారణాల వల్ల ప్రాథమికంగా పోలీసులకు కనీసం చిన్న ఆధారం కూడా దొరకలేదు. ఈ కేసును పోలీసు శాఖ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, సవాలుగా తీసుకుంది. రంగంలోకి దిగిన వీరులపాడు ఉప నిరీక్షకులు బి.అభిమన్యు తన బృందంతో కలిసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తును వేగవంతం చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని కిలోమీటర్ల కొద్దీ నిఘా చిత్రాలను రాత్రింబవళ్ళు పరిశీలించి, నిందితుడు పారిపోయిన మార్గాన్ని, అతను ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. స్థానిక సమాచార వ్యవస్థ ద్వారా లభిం చిన వివరాలు, అనుమానితుల కదలికలపై కూపీ లాగడంతో నిందితుడి ఆచూకీ లభ్యమైంది .నిందితుడు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు పెద్దాపురం ఆంధ్రా సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు పక్కా వ్యూహంతో వలపన్ని తన్నీరు కార్తీక్‌ను అదుపులోకి



తీసుకున్నారు. అతన్ని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి చోరీ చేసిన బంగారు నానుతాడును పోలీసులు పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నేర తీవ్రతను బట్టి చట్టపరమైన ఉచ్చు బిగించారు. మొదట నమోదు చేసిన భారతీయ న్యాయ సంహిత సెక్షన్‌తో పాటు, ప్రాణాంతక దాడి మరియు చోరీకి సంబంధించి అదనపు సెక్షన్లను ఈ కేసులో చేర్చారు. ఈ కేసును అత్యంత ప్రతిభావంతంగా ఛేదించిన పోలీస్ అధికారులను పలువురు అభినందించారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, గ్రామీణ ఉప పోలీసు కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, నందిగామ సహాయ పోలీసు కమిషనర్ సీహెచ్. శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో, నందిగామ రూరల్ వృత్త నిరీక్షకులు వైవీవీఎల్ నాయుడు పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ విజయవంతమైంది. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన వీరులపాడు ఉప నిరీక్షకులు బి.అభిమన్యు మరియు పోలీసు సిబ్బంది షేక్ సుల్తాన్, ఎంఎస్ఆర్ కృష్ణప్రసాద్, హోంగార్డు శేఖర్‌ల ప్రతిభను నందిగామ రూరల్ వృత్త నిరీక్షకులు వైవీవీఎల్ నాయుడు ప్రత్యేకంగా అభినందించి వారికి బహుమతులు అందజేశారు. నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నందిగామ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు మీడియాకు వెల్లడించారు.

# వీరులపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం

వీరులపాడు, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)




జీసస్ క్రైస్ట్ వీరులపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం సోమవారం తాటిగుమ్మి గ్రామంలోని పాస్టర్ పి. అబ్రహం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి దైవజనులు ఎన్.ఎస్. ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ విజయ్ కుమార్ వాక్య సందేశాన్ని అందించారు. దేవునిని తమ దేవునిగా కలిగి ఉన్న జనులు ధన్యులని, ఆయన తనకు స్వాస్థ్యంగా ఏర్పరచుకున్న జనులు ధన్యులని తెలిపారు. దేవుడు తన నివాస స్థలమైన పరలోకం నుంచి భూలోక నివాసులందరినీ చూస్తున్నాడని, దైవ సేవకులు పవిత్రమైన జీవితం కలిగి లోకంలో ఉన్న వారికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. దేవుని ప్రేమను, గొప్పతనాన్ని అనేక మందికి పంచాలని, దేవుడు ఇచ్చిన తలాంతులను ఇతరులకు ప్రోత్సాహకరంగా ఉపయోగించాలని బిషప్ డాక్టర్ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. లేఖనాల ఆధారంగా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. సభను ఉద్దేశించి అధ్యక్షుడు ఎన్.ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ పాస్టర్లు అందరూ ప్రేమతో, సహోదర భావంతో మెలగాలని అన్నారు. ఐక్యతతో పరిచర్యను బలపరచుకోవడానికి ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని, కష్ట సమయాల్లో ఒకరికి ఒకరు ఆదరణగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు దైవ సేవకులు ప్రార్థనలు నిర్వహించారు. చందర్లపాడు ఫెలోషిప్ ప్రెసిడెంట్ డి. శ్రీను, పాస్టర్ సామ్యూల్, సెక్రెటరీ ఎన్. ఇస్సాక్, యేసురత్నం, మేషక్, కె. నాగేశ్వరరావు, బి. సురేష్ బాబు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు. అర్హులైన వారికి ఐడెంటిటీ కార్డులను బిషప్ డాక్టర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

## వైసీపీ నేతలను అక్రమ కేసులతో వేధిస్తున్నారంటూ జగన్‌మోహన్‌రావు ఆరోపణ

**నందిగామ, సెప్టెంబర్ 15: (ప్రజా వీక్షణం)**

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న గ్రామాల్లో ఆ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ఆరోపించారు.కంచికచర్ల మండలం మొగులూరులో ఇటీవల జరిగిన ఘటనకు రాజకీయ రంగు పులిమి, ఘటనతో సంబంధం లేని వైసీపీ నాయకుడు, నందిగామ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావుపై కేసు నమోదు చేయడం సరికాదని అన్నారు. అసలు ఘటనకు సంబంధించిన కారణాలు, అందులో పాల్గొన్న వ్యక్తులు, సీసీ ఫుటేజీలను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని కోరారు.ఘటనకు సంబంధించి పోలీసులు ఒక వర్గం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని చెబుతున్నారని, అయితే పూర్తి స్థాయిలో విచారణ జరిపిన తర్వాతే చర్యలు తీసుకోవాల్సి ఉందని జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కేసు పేరుతో బండి మల్లికార్జునరావు, ఆయన అనుచరులను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి గంటల తరబడి కూర్చోబెట్టడం సరికాదన్నారు.రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అక్రమ కేసులపై న్యాయపరంగా పోరాడతామని, వైసీపీ నాయకులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.బండి మల్లికార్జునరావుపై కేసు నమోదును నిరసిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.




## వినాయక నిమజ్జనం ప్రశాంతంగా.. సురక్షితంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### అధికారులకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాలు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వివిధ నిమజ్జన ప్రదేశాలను ఆయన మంగళవారం పరిశీలించి, భక్తుల సౌకర్యార్థం అధికారులు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, రాకపోకల నియంత్రణ, భద్రత వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేసి, నిమజ్జన ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.నిమజ్జన ప్రదేశాల్లో నిరంతరం పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్, పురపాలక, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. భక్తులు, నిర్వాహకులుఅధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



## సమగ్ర వివరాలను నమోదు చేయాలి

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)**

నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్‌లో భాగంగా పశు సంపదకు సంబంధించిన సమగ్ర వివరాలనుప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధి కారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వ హించారు. పశువుల నమో దు, టీకాలు, రైతులఆధార్ అనుసంధానం, పశువైద్య శాలల మ్యాపింగ్‌పై వివరా లు అడిగి తెలుసుకున్నా రు. పెండింగ్ వివరాల నమోదును వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయా లని సూచించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం లో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధా కిషన్, జడ్పీ సీఈఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, విజయ డెయిరీ డీడీ ధనరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి...

### మద్యం, గంజాయి విక్రయాలను అరికట్టాలి. ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో ఐదేళ్ల బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడిన ఘటనను ఖండిస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికకు రక్షణ కల్పించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. చిన్నారులపై ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.కాగజ్‌నగర్ ప్రాంతంలో మద్యం, గంజాయి విక్రయాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మహిళలు, బాలికల భద్రతపై పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రధాన కార్యదర్శి దుర్గం అనిత, కోశాధికారి షహీన్ సుల్తానా, జిల్లా కమిటీ సభ్యురాలు సులోచన, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, నాయకులు మాదారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

### తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 35 వార్డుల్లో వివిధ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ సందర్శించారు. ఆయా మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ సర్వవిజయాలతో ముందుకు సాగాలని విఘ్నేశ్వర స్వామివారిని వేడుకున్నట్టు గొర్రెల శ్రీధర్ తెలిపారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా పండుగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. గొర్రెల శ్రీధర్ మండపాల వద్దకు చేరుకున్న సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, యువత, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



## జంగారెడ్డిగూడెం డివిజన్‌లో కలకలం: మత్తు ఇంజెక్షన్ల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

### -- ఆర్ఎంపి డాక్టర్ అరెస్ట్, 73 ఇంజెక్షన్లు స్వాధీనం!

**జంగారెడ్డిగూడెం సెప్టెంబర్ 15:(ప్రజా వీక్షణం)**

జంగారెడ్డిగూడెం ప్రాంతంలో కలకలం సృష్టించిన ట్రామడాల్ మత్తు ఇంజెక్షన్ల అక్రమ విక్రయాల కేసులో పోలీసులు దూకుడు పెంచారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, జంగారెడ్డిగూడెం డివిజనల్ పోలీసు అధికారి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో... సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వి. సుభాష్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. వీరప్రసాద్ తమ సిబ్బందితో కలిసి దర్యాప్తును వేగవంతం చేసి మరో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసులో భాగంగా కుక్కునూరు మండలం, కివ్వక గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు (ఆర్ఎంపి) పగిల్ల నాగేంద్రకుమార్ (తండ్రి: శ్రీనివాసరావు, వయస్సు: 31) పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన వద్ద నుంచి ఎలాంటి బిల్లులు, వైద్యుల చీటీ లేని 73 ట్రామడెక్స్ మత్తు ఇంజెక్షన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈ అక్రమ తతంగం వెలుగులోకి వచ్చింది. ఎటువంటి అనుమతులు లేకుండా మత్తు ఇంజెక్షన్లను రహస్యంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్న ఈ ముఠాకు సంబంధించి, గతంలోనే లక్ష్మి శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ యజమాని కాండ్రేగుల లక్ష్మణ సాయి కిషోర్, జ్యోతిక పెద్దింటి మెడికల్ హాల్ యజమాని ఏలూరి సతీష్, రూపా పెద్దింటి మెడికల్ ఏజెన్సీ యజమాని ఏలూరి దుర్గా ప్రసాద్, దేవ రాజశేఖర్, చిరు మెడికల్ అండ్ జనరల్స్ షాప్ యజమాని తమ్మిశెట్టి చిరంజీవి, అలాగే భవాని మెడికల్ ఏజెన్సీస్ యజమాని మాధవరపు శివకృష్ణలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.అలా అరెస్టైన వారిని విచారించగా లభించిన సమాచారం ఆధారంగానే, గ్రామీణ వైద్యుడు పగిల్ల నాగేంద్రకుమార్ కూడా ట్రామడాల్ ఇంజెక్షన్లను కొనుగోలు చేసి అక్రమంగా విక్రయిస్తున్నట్లు తేలిందని, దీంతో అతన్ని మంగళవారం అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మత్తు పదార్థాలు విక్రయించే ఎవరినీ వదిలిపెట్టబోమని, కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.



## స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాన్ని వెలది కొత్తపాలెలో నిర్వహించిన సి డి పి ఓ జె లక్ష్మి భార్గవి

**చందర్లపాడు సెప్టెంబర్ 15 ప్రజా వీక్షణం**

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం వెలదీప్ కొత్తపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర లో పోషక ఆహార మా సోత్స వాలు సెప్టెంబర్ 9నుండి అక్టోబర్ 8 వరకు నిర్వహించలి అన్న సి డి పి ఓ లక్ష్మీ భార్గవి ఆదేశాలనుసారం సూపర్వైజర్ ఓ శ్రీదేవి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ మాసోత్సవాలలో నాలుగు వారాలు ఐదు రకాల థీమ్స్ ఇవ్వడం జరుగుతుందని మొదటివారం ఆహారం మోతాదులో సరైన పోటీల్లో ఉన్న ఆహారాన్ని అందించడం జరుగుతుందని, రెండవ వారంలో అంగన్వాడి కేంద్రాలలో తాజా వేడిగా వండిన ఆహారాన్ని, మూడోవారం సమాజ భాగస్వామ్యం మరియు బాధ్యత, నల్గొవ వారం పోషణ ప్రారంభ ప్రేరణ మరియు బాలల అభివృద్ధి ఐదో వారం ప్రధానమంత్రి మాతృ వందన యోజన మరియు మాతృ నగదు బదిలీ, అలాగే మనం ప్రతిరోజు తినే ఆహారంలో ధాన్యాలు దుంపలు, మాంసం కూరగాయలు పాలు పెరుగు అన్నీ ఉండే విధంగా చూసుకోవాలన్నారు

ఒకే ఆహారం కాకుండా ఆహారంలో వైవిధ్యం ఉండాలన్నారు సీజనల్గా ఉండే ఆకుకూరలు పండు కూరగాయలు వాడుతూ ఉండాలని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో వినతి కొత్తపాలెం అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి మరియు సిబ్బంది పాల్గొన్నారు



## రెబ్బెన, వాంకిడి, కెరమెరి మండలాల సర్పంచులతో ఆత్రం సుగుణక్క ప్రత్యేక సమావేశాలు..

### గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై చర్చ..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రెబ్బెన, వాంకిడి, కెరమెరి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులతో డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మూడు మండలాల సర్పంచులతో ఒకేసారి కాకుండా, ఒక్కో మండలానికి చెందిన సర్పంచులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులపై సర్పంచులతో చర్చించారు. గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, స్థానికంగా నెలకొన్న సమస్యలను సర్పంచులను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు కోసం త్వరలోనే ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి కృషి చేస్తానని ఆత్రం సుగుణక్క తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఆయా సమస్యల పరిష్కారం మరియు గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆత్రం సుగుణక్క పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అజ్మీర శ్యామ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు రాపర్తి మూరలి,డీసీసీ ఉపాధ్యక్షులు భీమ్ రావ్,కాంగ్రెస్ పార్టీ రెబ్బెన మండల అధ్యక్షుడు కిషన్ గౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ చారి, తుంగెడ సర్పంచ్ బుచ్చక్క పర్వతాలు, పాసిగామ్ సర్పంచ్ శంకరమ్మ, రాజారాం సర్పంచ్ లక్ష్మి పురుషోత్తం, మాధ్వాయిగూడ సర్పంచ్ సంధ్య మహేష్, ఇంద్రానగర్ సర్పంచ్ ధరావత్ అరుణ కృష్ణ, కిష్టాపూర్ సర్పంచ్ సప్న వెంకట్ రెడ్డి, రాంపూర్ సర్పంచ్ మాధవ్, లక్ష్మీపూర్ సర్పంచ్ సుభాష్, ధర్మారం సర్పంచ్ కొండపల్లి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఎలగల సాయికుమార్,వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గురునులే మెంగాజీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉప్పుల కృష్ణ, బంబార సర్పంచ్ బెండరె కృష్ణాజీ, లెండిగూడ సర్పంచ్ తాటి కుమారి, సామెల సర్పంచ్ వాడ్గురే సంతోష్, కమన ఉపసర్పంచ్ లావు కుమార్, వాంకిడి మండల ఉపసర్పంచ్ దీపక్ ముండే, కోమటిగూడ విజయ్ కుమార్, భీంరావ్ కానర్గవ్, నాగశే భాగ్యశ్రీ బెండరా, జైపూర్ సర్పంచ్ కోలే పత్రు, రమేష్ బెండార, జాబ్రే సునీత,కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహ్మద్ సుజాయిత్ ఖాన్, పరందోలి సర్పంచ్ రాథోడ్ పుష్పలత, ముఖదం గూడ సర్పంచ్ జాదవ్ విమలాబాయి, బర్లల్‌గూడ సర్పంచ్ శంకర్, కరంజివాడ సర్పంచ్ బలవత్, జోడేఘాట్ ఉపసర్పంచ్ కుంరం లాకెరావ్, సంగ్వి ఉపసర్పంచ్ సిడం ఇరు, కేయిరి ఉపసర్పంచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

GENERAL NEWS

16 బుధవారం సెప్టెంబర్ 2026

10

www.prajaveekshanam.in

ప్రజావీక్షణం దినపత్రిక

# పంచాయతీ కార్యదర్శి హాజరుపై, నిధులు దుర్వినియోగం, ఏ జెండా లేకుండా గ్రామ సభ నిర్వహించడం పైన కలెక్టర్‌కు ఫిర్యాదు...





**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో ని జగన్నాథ్ పూర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీకి హాజరు విషయంలో గందరగోళం నెలకొంటున్నట్లు సర్పంచ్ ఆరోపించారు.పంచాయతీ కార్యదర్శి విధులకు హాజరయ్యే తీరుపై పలు అంశాలను ప్రస్తావిస్తూ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ద్వారా సర్పంచ్ తెలియజేశారు. కార్యదర్శి హాజరు, విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. గ్రామ పంచాయతీలో నిధుల అవకతవకలపై ఫిర్యాదు,పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపిస్తూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం కేటాయించిన నిధుల వినియోగం, ఖర్చులకు సంబంధించిన రికార్డులు, బిల్లులు, వౌచర్లు తదితర అంశాలపై సమగ్ర విచారణ, ఆడిట్ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని..

**ఎజెండా లేకుండా గ్రామసభ నిర్వహణపై కలెక్టర్‌కు సర్పంచ్ ఫిర్యాదు**

జగన్నాథ్ పూర్: జగన్నాథ్ పూర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఎజెండా లేకుండా గ్రామసభ నిర్వహించినట్లు సర్పంచ్ ఆరోపించారు.గ్రామసభ నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, విధివిధానాలను పాటించకుండా గ్రామసభ నిర్వహించిన అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి సర్పంచ్



తీసుకెళ్లారు.గ్రామసభ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, నోటీసులు, ఎజెండా తదితర అంశాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని సర్పంచ్ కోరారు.గ్రామ పంచాయతీ పరిపాలనలో పారదర్శకత, నిబంధనల అమలు కోసం ఈ అంశంపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందచేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పీఎంశ్రీ పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)**

జిల్లాలోని 19 పీఎంశ్రీ పాఠ శాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్‌లో పీఎంశ్రీ పాఠశాలలకు విడుదలైన నిధుల వినియోగంపై సమీ క్ష నిర్వహించారు. నిధుల కేటాయింపు, ఇప్పటివరకు చేసిన ఖర్చు, చేపట్టిన పనుల వివరాలను ప్రధానో పాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటర్వెన్షన్‌కు కేటాయిం చిన నిధులను నిర్ణీత గడువులోగా వినియోగించి పనులు-ఖర్చులకు సంబం ధించిన పూర్తి నివేదికలను సమర్పించాలని సూచిం చారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో విద్యాశాఖ అధికారులు, పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యా యులు పాల్గొన్నారు.



# పేరాయిగూడెంలో కన్నులపండువగా గణేశ్ ఉత్సవాలు!

## కౌన్సిలర్ డా.భూక్యా ఉదయ జ్యోతి ప్రత్యేక పూజలు..

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం):**

అశ్వారావుపేట మండలంలోని పేరాయిగూడెం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంబరాన్ని తాటే వేడుకలా కొనసాగుతున్నాయి. అరుంధతి గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ గణేశ్ నవరాత్రి వేడుకలతో గ్రామంలో పండుగ శోభ సంతరించుకుంది. గణపయ్య సన్నిధిలో నిత్యం జరుగుతున్న పూజా కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక కౌన్సిలర్ డా. ఉదయ జ్యోతి గణపయ్యకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు జుజ్జురపు శ్రీరామ్మూర్తి--మంగతయారు దంపతులు, కాసాని చంద్రమోహన్--నాగ శేషా పద్మ దంపతులు సైతం స్వామివారిని దర్శించుకుని పూజాదికాలు జరిపించారు. అనంతరం గణపయ్యకు వేదోక్తంగా అర్చనలు, హారతులు సమర్పించి... గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, గ్రామాభివృద్ధి శీఘ్రంగా జరగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను ఘనంగా పంపిణీ చేశారు.ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో టౌన్ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వర్లు, మొటూరి మోహన్, పాలవలస జీవన్ రావు, తగరం హరి తదితరులతో పాటు గ్రామ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు, యువతీ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చిన భక్తులు గణపయ్యను దర్శించుకుని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు.



# గణేష్ మండపాల వద్ద జాతీయ జెండా ఎగురవేయాలి.. హిందూ ఉత్సవ సమితి..





**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో సెప్టెంబర్ 17 న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సంతోష్ ఫంక్షన్ హాల్ లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సహ కార్యవాహ ప్రముఖ్ రంగస్వామి మాట్లాడుతూ, ప్రతి గణేష్ మండపం వద్ద జాతీయ జెండాను ఎగురవే యాలని పిలుపునిచ్చారు. గణేష్ నవరాత్రులు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వాహకులు ఐక్యమత్యంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 17న ప్రతి మండపం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. అనంతరం హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు తాటి శ్రీనివాస్ మాట్లాడుతూ,.మండపాల నిర్వాహకులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామని అన్నారు. అలాగే నిమజ్జనం ఈనెల 25 న(శుక్రవారం)ఉంటుందని తెలిపారు. నిమజ్జనాన్ని శాంతియుత వాతావరణంలో పోలీసు అధికారులు సూచించిన మార్గంలో శోభాయాత్రను జరుపుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు తాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అరుణ్ లోయా, కోశాధికారి దెబ్బటి శ్రీనివాస్, హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు మహావీర్ లోయ, సిందం శ్రీనివాస్ పోలోజు శ్రీనివాస్, కమల్ బంగ్, వైద్య బాలకృష్ణ, ఈశ్వేశ్వర్ రావు, దేశముఖ్ శ్రీనివాస్ , ఎమ్మాజీ సంతోష్, గజ్జల లక్ష్మణ్, నంది సాయి, బైరిశెట్టి రవి, ఆంజనేయులు గౌడ్, సాయి గౌడ్, చిట్టి నరేష్, అనిల్, తిక్కం చంద్ శర్మ, హరీష్ పెద్ది, దేశముఖ్ సాయి, కరెంగుల వినోద్, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# మహేష్‌కుమార్ గౌడ్‌కు కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

## -- టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో అభినందనలు

**బోయిన పల్లి, సెప్టెంబర్ 15 (ప్రజా వీక్షణం)**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేయడంలో ఆయన చేస్తున్న కృషిని నాయకులు అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజలకు పార్టీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో ఆయన నాయకత్వం కీలకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీభవన్‌కు చేరుకుని మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చందర్‌రావు, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్, అరవింద్‌కుమార్, సాహెబ్ సేహంషా, క్రాంతికుమార్, రాము, వెంకటేష్ యాదవ్, పాల్గన్‌రావు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న మహేష్‌కుమార్ గౌడ్‌కు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## -- మల్లికార్జున కాలనీ రోడ్ నంబర్ 4లో ముద్దం నర్సింహ యాదవ్ పర్యటన

## -- అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచన

**బోయిన పల్లి: సెప్టెంబర్ 15: (ప్రజా విక్షణం)**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని మల్లికార్జున కాలనీ రోడ్ నంబర్ 4లో వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజలు ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో రోడ్డుపై నడిచే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఆయన స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడం వల్లే సమస్య తీవ్రతరమవుతోందని స్థానికులు ఆయనకు వివరించారు.ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు రోడ్డు నిర్మాణ పరిస్థితులను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ముద్దం నర్సింహ యాదవ్ సూచనల మేరకు సంబంధిత అధికారులు కూడా సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డు పరిస్థితులను క్షేత్రస్థాయిలో



పరిశీలించారు. అవసరమైన కొలతలు తీసుకుని, సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలు ప్రతిసారీ వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. వర్షపు నీటి నిల్వ సమస్యతో పాటు డ్రైనేజీ, రహదారి పరిస్థితులను కూడా సమగ్రంగా పరిశీలించి అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, ప్రసాద్, ఓబుల్‌రెడ్డి, శ్రీశైలం, మనోహర్ యాదవ్, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
SPORTS/ BUSINESS
16 బుధవారం సెప్టెంబర్ 2026
11
www.prajaveekshanam.in



# తీవ్ర దుమారం రేపుతున్న స్పోర్ట్స్ యాప్ యాడ్

న్యూయార్క్: అమెరికా నటి సిడ్నీ స్వీనీతో చేసిన ఓ యాడ్ తీవ్ర దుమారం రేపుతున్నది. క్రీడల్లోని మహిళలను శృంగారభరితంగా చూపిస్తున్నట్లు ఆ యాడ్ ఉందని విమర్శలు వస్తున్నాయి. స్పోర్ట్స్ మార్కెట్ ట్రేడింగ్‌కు చెందిన నోవిగ్ యాప్‌ను నటి సిడ్నీ ప్రమోట్ చేసింది. ఆ ప్రకటనలో ఆమె దాదాపు నగ్నంగా నటించింది. అయితే ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడా వస్తువులతో ఆమె తన శరీరాన్ని కప్పుకుని ట్రేడింగ్ యాప్‌ను ప్రమోట్ చేసింది. ఇక సోషల్ మీడియాలో అనేక మంది మహిళా అథ్లెట్లు ఆ యాడ్‌ను తప్పుపట్టాడు. మహిళలను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. నాలుగు సార్లు ఒలింపిక్ స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్ గెలిచిన ఏరియార్నే టిట్‌మస్ స్పందిస్తూ ఆ యాడ్‌ను చూస్తున్నప్పుడు ఆవేశం వస్తున్నట్లు ఆమె అన్నారు. స్త్రీ శరీరాలను డబ్బు సంపాదన కోసం వాడుతుంటే, మహిళా క్రీడలు ఎలా వృద్ధి చెందుతాయని ఆమె ప్రశ్నించారు. బ్రిటీష్ స్ప్రింటర్ ఆమే హంట్, యూఎస్ జిమ్నాస్ట్ గ్రేసీ క్రామర్ కూడా ఆ యాడ్‌ను తప్పుపట్టారు. రగ్బీ ప్లేయర్ సోఫీ ఫెల్లా స్పందిస్తూ.. సిడ్నీ నటించిన యాడ్ మహిళలను కించపరిచే రీతిలో ఉన్నట్లు పేర్కొన్నది. నటి స్వీనీ గతంలో రెండు సార్లు ఎమ్మీ అవార్డుకు నామినేట్ అయ్యింది. అమెరికన్ ప్రొఫెషన్ బాక్సర్ క్రిస్టీ మార్టిన్ బయోపిక్‌పై తీసిన క్రిస్టీలో ఆమె నటించింది.

# సీసీఓబీ ఫుట్‌బాల్ విన్నర్ హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ




హైదరాబాద్, ఆట ప్రతినిధి: సీసీఓబీ కప్ అండర్-21 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ కైవసం చేసుకుంది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో గ్లోబ్ ఎఫ్‌సీ 1-0 గోల్ తేడాతో హైదరాబాద్ స్పోర్టింగ్ ఎఫ్‌సీపై విజయం సాధించింది. మ్యాచ్ 55వ నిమిషంలో ఇంతియాజ్ అహ్మద్ చేసిన ఏకైక గోల్ జట్టును విజేతగా నిలిబెట్టింది. అంతకుముందు సెమీఫైనల్లో గ్లోబ్ టీమ్ 1-0తోఆతిథ్య సీసీఓబీపై నెగ్గింది

# టెస్టుల్లో ఫ్లాప్.. వన్డేల్లో తొలి శతకంతో రెచ్చిపోయిన కుర్రాడు..!



మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం అదరకున్నా వన్డేల్లో మాత్రం దంచేశాడు మ్యాట్ రెన్‌షా బంగ్లాదేశ్‌పై తీవ్రంగా నిరాశపరిచిన అతడు జింబాబ్వేపై చితక్కొట్టాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ కుర్రాడు శతకం బాదేశాడు. బ్రాడ్ ఎవాన్స్ ఓవర్లో సింగిల్ తీసిన అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌లో మొదటి సెంచరీ నమోదు చేశాడు.స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో విఫలమైన ఆస్ట్రేలియా కుర్రాడు మ్యాట్ రెన్‌షా వన్డేల్లో శతక్కొట్టాడు. మంగళవారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జింబాబ్వే బౌలర్లను ఈ లెఫ్ట్ హ్యాండర్ ఉతికేశాడు. టాపార్డర్ విఫలమైనా వన్డేల్లో మొదటి సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించాడు. 107కే నాలుగు వికెట్లు పడిన వేళ.. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చి ధనాధన్ ఆటతో అలరించిన అతడు 94 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 109 రన్స్ సాధించాడు.

# మిథాలీని అధిగమించిన చరణి.. అత్యధిక రేటింగ్ పాయింట్లతో రికార్డు

దుబాయ్: భారత యువ స్పిన్నర్ శ్రీచరణి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకుల్లో అగ్రస్థానాన కొనసాగుతున్న ఈ తెలుగమ్మాయి.. తాజాగా 800 రేటింగ్ పాయింట్ల మార్కును దాటి కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్(804) సాధించింది. ఆసియా కప్ ఫైనల్‌లో 4 వికెట్లు తీయడమే గాక టోర్నీ ఆసాంతం రాణించిన చరణి టాప్ ప్లేస్‌నుమరింత పటిష్టం చేసుకుంది.దాంతోపాటు 800 రేటింగ్ పాయింట్లు సాధించిన భారత మహిళా క్రికెటర్‌గా రికార్డులకెక్కింది. 2011లో నాటి సారథి మిథాలీ రాజ్ 780 పాయింట్లు సాధించడమే ఇప్పటిదాకా భారత్ తరఫున అత్యుత్తమం. కాగా చరణి మరో మూడు పాయింట్లు సాధిస్తే టీ20 ర్యాంకింగ్స్‌లో ఆల్‌టైమ్ హై రేటింగ్ పాయింట్లు సాధించిన ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ షట్ (2018లో 806) రికార్డును అధిగమిస్తుంది.






# జ్వెరెవ్ ఎట్టకేలకు.. యూఎస్ ఓపెన్ టైటిల్ కైవసం

న్యూయార్క్: పుష్కరకాలంగా యూఎస్ ఓపెన్ టోర్నీ ఆడుతూ 2020లో టైటిల్‌కు చేరువగా వచ్చినా ఫైనల్‌లో ఓడిన జర్మనీ ప్లేయర్ అలగ్జాండర్ జ్వెరెవ్ ఎట్టకేలకు తన కలను నెరవేర్చుకున్నాడు. 12 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఈ టోర్నీలో సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. సోమవారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్లో జ్వెరెవ్ 6-3, 7-6 (7/2), 5-7, 6-2తో అమెరికాకు చెందిన బెన్ షెల్టన్‌ను ఓడించాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన జోష్‌లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన ఈ జర్మన్ స్టార్‌కు టైటిల్ పోరులో షెల్టన్ నుంచి 2, 3 సెట్లలో ప్రతిఘటన ఎదురైనా తన అనుభవంతో పైచేయి సాధించాడు. టాప్-10 నుంచి జొకో ఔట్ ఏటీపీ ర్యాంకుల్లో నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) టాప్-10 నుంచి నిష్క్రమించాడు. ఈ టోర్నీలో తొలిరౌండ్‌లోనే వెనుదిరిగిన జొకో.. ఐదో స్థానం నుంచి 12వ స్థానానికి పడిపోయాడు. ఆధునిక టెన్నిస్‌లో దిగ్గజాలుగా వెలుగొందుతున్న ‘బిగ్ త్రీ’ (రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, జొకోవిచ్) టాప్-10లో లేకుండా ఉండటం 2002 తర్వాత ఇదే ప్రథమం. రెండు దశాబ్దాల పాటు టెన్నిస్ ప్రపంచాన్ని ఏలిన ఈ త్రయంలో ఫెడరర్ 2022లో, నడాల్ 2024లో ఆటకు వీడ్కోలు పలికారు.

## మరణం లేని మనిషి కథ.. ఆసక్తికరంగా జి.వి. ప్రకాష్ కుమార్ 'ఇమ్మోర్టెల్' తెలుగు ట్రైలర్




సంగీత దర్శకుడిగా, నటుడిగా టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జి.వి. ప్రకాష్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'ఇమ్మోర్టెల్' . తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మారీయప్పన్ చిన్న దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే తమిళంలో విడుదలై ఘన విజయం సాధించగా తాజాగా తెలుగులో సెప్టెంబర్ 19న విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రంలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు.ఇక ఈ ట్రైలర్ చూస్తే.. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ప్రారంభంలో జి.వి. ప్రకాష్ కుమార్ మరియు కాయదు లోహర్ మధ్య లవ్ స్టోరీగా అనిపించినా, ఆ తర్వాత కథ పూర్తిగా ఒక రహస్యమైన మలుపు తిరుగుతుంది. ఈ చిత్రంలో కథాంశం మరణం లేని ఒక రహస్య వ్యక్తి చుట్టూ తిరుగుతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. సామ్ సి.ఎస్ అందించిన నేపథ్య సంగీతం మరియు విజువల్స్ ప్రేక్షకులను భయపెడుతూనే, సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి.

## రష్మికకు అరుదైన అవకాశం.. ఏకంగా భారతరత్న గాయని పాత్రలో.. 'ఎం.ఎస్.' మూవీ అధికారిక ప్రకటన



నేషనల్ క్రష్ రష్మిక మందన్నకు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అవకాశం దక్కింది. ఇప్పటివరకు విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ స్టార్ హీరోయిన్.. ఇప్పుడు భారతదేశ సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేసిన దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి 'ఎం.ఎస్. -- ఎ లెగసీ ఆన్ స్క్రీన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాలో సుబ్బులక్ష్మి పాత్రను రష్మిక మందన్న పోషించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానులతో పాటు సంగీత ప్రియుల్లోనూ ఆసక్తి మరింత పెరిగింది.రష్మికను ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాత్రకు ఎంపిక చేసినట్లు గతంలోనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక పాత్ర కోసం ఆమె స్క్రీన్ టెస్ట్‌కి కూడా హాజరైనట్లు అప్పట్లో సమాచారం వెలువడింది. ఇప్పుడు అదే విషయం అధికారిక ప్రకటనతో నిజమైంది.రష్మిక లాంటి యువ కథానాయికకు భారతీయ సంగీత చరిత్రలో అత్యంత గౌరవనీయమైన వ్యక్తిత్వాల్లో ఒకరైన సుబ్బులక్ష్మి పాత్రను పోషించే అవకాశం రావడం ప్రత్యేకంగా నిలుస్తోంది. పాత్రకు తగ్గట్టుగా ఆమె రూపురేఖలు, హావభావాలు, నటనలో ఎలాంటి మార్పులు తీసుకురానున్నారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ బయోపిక్‌కు ప్రతిభావంతుడైన దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. కథను భావోద్వేగపూర్వకంగా, సహజమైన శైలిలో తెరకెక్కించడంలో మంచి పేరు తెచ్చుకున్న ఆయన.. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితాన్ని వెండితెరపై ఎలా ఆవిష్కరిస్తారనే దానిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ చిత్రానికి స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. సుబ్బులక్ష్మి వంటి మహా గాయని జీవిత కథకు సంగీతం అత్యంత కీలకమైన అంశం కావడంతో.. అనిరుధ్ ఎంపిక కూడా ఈ ప్రాజెక్ట్ స్థాయిని తెలియజేస్తోంది.ఈ భారీ చిత్రాన్ని అల్లు అరవింద్, బన్నీ వాసు, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.'ఎం.ఎస్. -- ఎ లెగసీ ఆన్ స్క్రీన్' చిత్రాన్ని సెప్టెంబర్ 16న చెన్నైలో అధికారికంగా ప్రారంభించనున్నారు. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 110వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుండటం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది.ఈ ప్రారంభోత్సవానికి విశ్వనటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అదే సమయంలో ఇండియన్ చోరల్ ఎన్‌సెంబుల్ బృందం ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాడిన ప్రముఖ గీతాలను ఆలపిస్తూ ఆమెకు సంగీత నివాళి అర్పించనుంది.అందువల్ల సినిమా ప్రారంభ కార్యక్రమం కూడా సాధారణంగా కాకుండా.. సుబ్బులక్ష్మి సంగీత వారసత్వాన్ని గుర్తుచేసే ప్రత్యేక వేడుకగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.






## కియారా--సిద్ధార్థ్ మధ్య నిజంగానే విభేదాలా? విడాకుల ప్రచారంపై క్లారిటీ ఇదే!

బాలీవుడ్‌లో ఎంతో క్రేజ్ ఉన్న జంటల్లో కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా జంట కూడా ఒకటి. ప్రేమలో పడిన ఈ ఇద్దరూ ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పెళ్లి తర్వాత కూడా వీరికి సంబంధించిన ప్రతి విషయం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తూనే ఉంది. అయితే తాజాగా ఈ జంట గురించి సోషల్ మీడియాలో కొన్ని వార్తలు వైరల్ అవుతుండటం చర్చనీయాంశంగా మారింది. కియారా, సిద్ధార్థ్ మధ్య కొంతకాలంగా విభేదాలు వచ్చాయని, ఇద్దరి మధ్య దూరం పెరిగిందని, చివరకు విడాకుల దిశగా వెళ్తున్నారంటూ కొన్ని కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా కియారా నటించిన 'టాక్సిక్' సినిమా కారణంగానే వీరి మధ్య గొడవలు మొదలయ్యాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో అసలు ఈ వార్తల్లో ఎంత నిజం ఉందనే చర్చ మొదలైంది.కియారా అద్వానీ నటించిన 'టాక్సిక్' సినిమాలోని కొన్ని సన్నివేశాలపై గతంలో సామాజిక మాధ్యమాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే ఆమె వైవాహిక జీవితంలోనూ ఇబ్బందులు మొదలయ్యాయని, సిద్ధార్థ్‌తో విభేదాలు తలెత్తాయని కొందరు ప్రచారం చేస్తున్నారు. అయితే సినిమా కోసం నటీనటులు పోషించే పాత్రలను, తెరపై కనిపించే సన్నివేశాలను వారి వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతం కియారా, సిద్ధార్థ్ మధ్య గొడవలకు 'టాక్సిక్' సినిమానే కారణమని నిర్ధారించడానికి



ఎలాంటి అధికారిక సమాచారం లేదు.కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా విడాకులు తీసుకోబోతున్నారనే ప్రచారానికి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. అంతేకాదు.. సిద్ధార్థ్ విడాకుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారనే ప్రచారానికి కూడా సరైన ఆధారాలు బయటకు రాలేదు.ఇద్దరూ తమ వైవాహిక బంధంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలను కేవలం ఊహాగానాలు, పుకార్లుగానే చూడాల్సి ఉంటుంది. బాలీవుడ్ సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ప్రముఖ జంటల విషయంలో చిన్న విషయాలు కూడా పెద్ద చర్చకు దారితీస్తుంటాయి. కొన్నిసార్లు ఒక ఫొటో, ఒక కార్యక్రమానికి హాజరు కాకపోవడం లేదా సోషల్ మీడియాలో పోస్టుల మధ్య గ్యాప్‌ను కూడా విడాకుల వార్తలకు కారణంగా చూపిస్తుంటారు.అందుకే కియారా--సిద్ధార్థ్ విషయంలోనూ అధికారిక సమాచారం వచ్చే వరకు ఎలాంటి నిర్ణయానికి రావడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## 'డేవిడ్ రెడ్డి' చిత్రంలో కమలారెడ్డిగా రమ్యకృష్ణ.. ఫస్ట్ లుక్ విడుదల!

మంచు మనోజ్ హీరోగా వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'డేవిడ్ రెడ్డి'. ఈ చిత్రంలో ప్రముఖ నటి రమ్యకృష్ణ అత్యంత శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె కమలారెడ్డి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. 'బాహుబలి' శివగామి తరహాలోనే మరోసారి రమ్యకృష్ణ కమలారెడ్డి పాత్రలో చాలా పవర్‌ఫుల్‌గా, ఫియర్స్‌గా కనిపించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు.రమ్యకృష్ణ బర్త్‌డే సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఆమె పాత్ర సినిమాకే ఒక ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మరియా రియాబోషాప్కా హీరోయిన్‌గా నటిస్తుండగా, సముద్రఖని, అభయ్ డియోల్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.

## విడుదలకి సిద్ధమైన 'మిస్సింగ్ మేఘన'.. వైభవంగా ప్రీ రిలీజ్ వేడుక..!



టాలీవుడ్ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వైవిధ్యభరితమైన చిత్రం "మిస్సింగ్ మేఘన". ఫస్ట్ కాపి మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహించారు. రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 18న గ్రాండ్ గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించింది. ప్రముఖ నిర్మాత దామోదర్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలో సినిమాకు సంబంధించిన విశేషాలను చిత్ర బృందం ఎంతో ఉత్సాహంగా పంచుకుంది. ముందుగా తంత్ర చిత్ర దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి మాట్లాడుతూ, తన స్నేహితుడైన వాసు (వాచస్పతి) దర్శకత్వంలో నరేష్ బాబు నిర్మాతగా వస్తున్న ఈ చిత్రం ఘనవిజయం సాధించి అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. నటుడు ధనుష్ రఘుముద్రి మాట్లాడుతూ, ఫస్ట్ కాపీస్ బ్యానరే తనకు గుర్తింపునిచ్చిందని, అదే బ్యానర్ నుంచి వస్తున్న ఈ సినిమాను ప్రేక్షకులందరూ సెప్టెంబర్ 18న థియేటర్లలో తిలకించి విజయవంతం చేయాలని కోరారు.సింగర్ సాకేత్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని పాటలు మరియు విజువల్స్ అద్భుతంగా వచ్చాయని, సినిమాకు సపోర్ట్ చేస్తున్న పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ నటుడు గోపరాజు రమణ మాట్లాడుతూ, దర్శకుడు వాచస్పతి ఒక మంచి కుటుంబ కథను అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే జోనర్స్ తో ఎంతో ఆసక్తికరమైన మలుపులతో తెరకెక్కించారని ప్రశంసించారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, ఈ చిత్రానికి పనిచేయడం ఒక చక్కని అనుభూతినిచ్చిందని, బెక్కం వేణుగోపాల్ సహకారంతో మంచి పాటలు అందించడం జరిగిందని తెలిపారు.ప్రముఖ నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ సినిమాను తాను చూశానని, చాలా ఇంట్రెస్టింగ్ గా ఉండటంతో తాను కూడా సపోర్ట్ చేయడానికి ముందుకు వచ్చానని చెప్పారు. అంకిత్, రామ్ కార్తీక్ ల నటన ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, కథే ఈ చిత్ర విజలానికి ప్రధాన బలమని, టీమ్ అందరి సపోర్ట్ తో ఈ సినిమాను అద్భుతమైన ప్రమోషన్స్ తో ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు.హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తన తొలి చిత్రం నుంచి తనకు మద్దతుగా నిలుస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రంలో సంగీతం, పాటలు ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తాయని, బెక్కం వేణుగోపాల్ మరియు ముఖ్య అతిథి దామోదర్ ప్రసాద్ అందించిన ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. నటుడు అంకిత్ కొయ్య మాట్లాడుతూ, సుదీర్ఘ విరామం తర్వాత మీడియా ముందుకు రావడం సంతోషంగా ఉందని, మీడియా సహాయసహకారాలతో ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, హీరో రామ్ కార్తీక్ పై ఉన్న నమ్మకంతోనే తాను ఈ వేడుకకు వచ్చానని తెలిపారు. ఒక నిర్మాతకు సినిమా విడుదల వరకు కాన్ఫిడెన్స్ చాలా అవసరమని, సినిమా అంటే కేవలం డబ్బు మాత్రమే కాదని కొందరి జీవితాలని ఆయన అన్నారు. చిన్న సినిమాలను ప్రేక్షకులు, మీడియా ఎప్పుడూ ఆదరించాలని, సెప్టెంబర్ 18న వస్తున్న ఈ కంటెంట్ రిచ్ మూవీ కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ చిత్రంలో రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య, గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు నటించారు. సాంకేతిక వర్గం విషయానికి వస్తే.. నిర్మాతగా పంచుమర్తి నరేష్ బాబు, సహ నిర్మాతగా దివెళా శ్రీనివాస్ రావ్, దర్శకత్వం వాచస్పతి, కథ & స్క్రీన్‌ప్లే వనరాజ్, సంభాషణలు వెంకట్ బద్దిగం, సంగీతం ఆర్.ఆర్.ధృవన్, ఛాయాగ్రహణం శామ్. కె. నాయుడు, ఎడిటింగ్ బసవా వ్యవహరించారు. సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com